నిజం రాసే ధైర్యం ఉందా?
అయితే
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా,
నిజం కోసం మాతో కలవండి.
vaarthasandhya@gmail.com

RNI TGTEL/25/A5065

vaartha sandhya

# వార్త సంధ్య

తెలుగు దిన పత్రిక

నిజం నిర్భయంగా మీ ముందుకు

www.vaarthasandhya.in
epaper.vaarthasandhya.in
7396122101,9951751662



SEGGEM KIRAN KUMAR
EDITOR & MD
VAARTHA SANDHYA , CM NEWS TV

ప్రచురణ : హైదరాబాద్, రంగారెడ్డి epaper.vaarthasandhya.in సంపుటి : 01 సంచిక : 25 మంగళవారం 06 - 01 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజిలు : 08 వెల : 6/-

## తెలంగాణలో నిరుద్యోగులకు గుడ్‌న్యూస్

2 లో

- వైద్యశాఖలో త్వరలోనే 850 పోస్టుల భర్తీ
- పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం
- కొత్తగా 490 వెంటిలేటర్లు, 9 ఎంఆర్ఐ యంత్రాల కొనుగోలుకు నిర్ణయం
- నిమ్స్‌లో 125 వెంటిలేటర్లు..
- అంబులెన్స్ రెస్పాన్స్ టైమ్‌ను 10 నిమిషాలకు తగ్గించేందుకు చర్యలు
- బస్తీ దవాఖానాలకు నేరుగా మందుల సరఫరా చేసేలా కొత్త విధానం

## తెలంగాణలో మరో 17 మంది మావోయిస్టులు మాత్రమే ఉన్నారు

- డీజీపీ శివధర్ రెడ్డి
- 17 మంది లొంగిపోతే తెలంగాణ మావోయిస్టు రహిత రాష్ట్రంగా నిలుస్తుందని వెల్లడి
- అందులో నలుగురు కేంద్ర కమిటీ, ఐదుగురు రాష్ట్ర కమిటీ సభ్యులు ఉన్నట్లు వెల్లడి
- ఆపరేషన్ కగార్ గడువుకు ముందే తెలంగాణ మావోయిస్టు రహితమవుతుందన్న డీజీపీ
- నక్సలైట్లు జనజీవన స్రవంతిలో కలిస్తే పోలీసు శాఖ నుంచి వారికి అవసరమైన సహాయం అందుతుందని డీజీపీ పేర్కొన్నారు



**వార్త సంధ్య, హైదరాబాద్, జనవరి 05 :** రాష్ట్రానికి చెందిన మరో 17 మంది మావోయిస్టులు లొంగిపోతే తెలంగాణ మావోయిస్టు రహిత రాష్ట్రంగా నిలుస్తుందని డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు. మావోయిస్టు పార్టీలో తెలంగాణకు చెందిన వారు 17 మంది మాత్రమే ఉన్నారని ఆయన వెల్లడించారు. వారిలో కేంద్ర కమిటీలో నలుగురు, రాష్ట్ర కమిటీలో ఐదుగురు, డివిజన్ కమిటీలో ఆరుగురు, అండర్ గ్రౌండ్‌లో ఇద్దరు ఉన్నారని తెలిపారు. వారిలో ఐదుగురు మహిళలు ఉన్నారని ఆయన అన్నారు. ఈ 17 మంది మావోయిస్టులపై మొత్తం రూ. 2.25 కోట్ల రివార్డు ఉందని ఆయన చెప్పారు. వారంతా లొంగిపోవాలని డీజీపీ శివధర్ రెడ్డి సూచించారు. ఆపరేషన్ కగార్ - మిగతా 2 లో

## వ్యక్తిగా వెళుతున్నా... రాజకీయ శక్తిగా తిరిగి వస్తా

- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్త రాజకీయ పార్టీపై కీలక ప్రకటన
- కచ్చితంగా గొప్ప రాజకీయ శక్తిగా ఎదుగుతానని ఆమె ధీమా వ్యక్తం
- తెలంగాణ జాగృతి త్వరలోనే రాజకీయ పార్టీగా అవతరిస్తుందన్న కవిత
- వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా పోటీ చేస్తామని వెల్లడి
- తనది ఆస్తుల పంచాయితీ కాదని, ఆత్మగౌరవ పంచాయితీ అన్న కవిత



**వార్త సంధ్య, హైదరాబాద్, జనవరి 05 :** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్త పార్టీపై కీలక ప్రకటన చేశారు. తన సంస్థ త్వరలోనే రాజకీయ పార్టీగా అవతరిస్తుందని, అందరూ తనను ఆశీర్వదించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. శాసనమండలిలో ఆమె మాట్లాడుతూ, తెలంగాణ జాగృతి రాజకీయ పార్టీగా మారబోతోందని, రాబోయే ఎన్నికల్లో తప్పకుండా పోటీ చేస్తామని ప్రకటించారు. కచ్చితంగా గొప్ప రాజకీయ శక్తిగా ఎదుగుతానని ఆమె ధీమా వ్యక్తం చేశారు. "వ్యక్తిగా సభ నుంచి వెళుతున్నా.. రాజకీయ శక్తిగా తిరిగి వస్తా" అని కవిత ప్రతిజ్ఞ చేశారు. ఉద్యమ ద్రోహులకు బీఆర్ఎస్ - మిగతా 2 లో

## వెనెజువెలా అధ్యక్షుడికి పుట్టపర్తితో బలమైన బంధం



2 లో

- సత్యసాయికి పరమభక్తుడు మదురో
- వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్య సత్యసాయి బాబా భక్తులు
- 2005లో పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయాన్ని సందర్శించిన మదురో దంపతులు
- తన కార్యాలయంలో సాయిబాబా చిత్రపటాన్ని ఉంచుకునేవారు మదురో
- సాయిబాబా మరణించినప్పుడు వెనెజువెలాలో జాతీయ సంతాప దినం ప్రకటించిన వైనం


## కోనసీమలో ఓఎన్జీసీ సైట్ వద్ద
# భారీ అగ్నిప్రమాదం

- మంత్రులను అప్రమత్తం చేసిన సీఎం చంద్రబాబు
- కోనసీమ జిల్లా మలికిపురంలో ఓఎన్‌జీసీ డ్రిల్ సైట్‌లో గ్యాస్ లీక్
- మరమ్మత్తు పనుల సమయంలో భారీగా ఎగిసిపడిన మంటలు
- రెండు గంటల పాటు కొనసాగిన లీకేజీతో స్థానికుల్లో తీవ్ర భయాందోళన
- పరిస్థితి అదుపులోకి తెచ్చిన అధికారులు, సహాయక చర్యలు ముమ్మరం



**వార్త సంధ్య, అమరావతి, జనవరి 05 :** కోనసీమ జిల్లాలో తీవ్ర ఆందోళన నెలకొంది. మలికిపురం మండలం ఇరుసుమండ గ్రామంలోని ఓఎన్జీసీ డ్రిల్లింగ్ సైట్‌లో భారీ గ్యాస్ లీకేజీ జరిగి, పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. సోమవారం మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఓఎన్జీసీకి చెందిన మోరీ-5 బావి వద్ద ఉన్న గ్యాస్ పైప్‌లైన్ నుంచి ఒక్కసారిగా గ్యాస్ పైకి చిమ్మడంతో మంటలు వ్యాపించాయి. దాదాపు రెండు గంటల పాటు పెద్ద శబ్దాలతో గ్యాస్ లీక్ అవడంతో స్థానికులు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో సమీపంలోని కొబ్బరి తోటలకు మంటలు అంటుకొని, 500కు పైగా చెట్లు కాలిపోయినట్లు ప్రాథమికంగా అంచనా - మిగతా 2 లో


## అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నివాసంపై కాల్పులు



- జేడీ వాన్స్ నివాసంపై కాల్పులు జరిపిన దుండగుడు
- కాల్పుల్లో జేడీ వాన్స్ ఇంటి అద్దాలు ధ్వంసం, నిందితుడు అరెస్టు
- అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నివాసం వద్ద ఘటన
- ఒక అనుమానితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఘటన జరిగినప్పుడు వాన్స్ కుటుంబం ఇంట్లో లేదన్న అధికారులు
- సీక్రెట్ సర్వీస్, స్థానిక పోలీసుల సంయుక్త దర్యాప్తు

**వార్త సంధ్య, ఢిల్లీ, జనవరి 05 :** అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నివాసంపై దాడి జరిగింది. ఓహియోలోని ఆయన ఇంటిపై ఓ దుండగుడు కాల్పులు జరిపాడు. - మిగతా 2 లో

## మాతృభాష మన మూలాలకు సంకేతం




2 లో

- మాతృభాషలో రాణిస్తే ఏ రంగంలోనైనా రాణిస్తాం
- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- త్యాగధనులను గుర్తు పెట్టుకుంటే స్ఫూర్తిదాయకంగా ఉంటుంది
- నందమూరి తారక రామారావు ఆత్మగౌరవంతో ముందుకెళ్లారు
- తెలుగు జాతి ఉన్నంతవరకు గుర్తు పెట్టుకునే ఏకైక నాయకుడు ఎన్టీఆర్ అని కొనియాడిన చంద్రబాబు

## తెలుగు రాష్ట్రాల మధ్య విద్వేషం కాదు - సమైఖ్యత అవసరం

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- గంగ-కావేరి కలవాలని, దేశంలో నీటి సమస్య పోవాలన్న సీఎం చంద్రబాబు
- ఐకమత్యంగా ఉంటేనే తెలుగువాళ్లు ప్రపంచంలో నెంబర్‌వన్ అవుతారని అభిప్రాయం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- తెలుగువాళ్లు కలిసుంటే ఎన్నో సమస్యలు పరిష్కరించుకోవచ్చని సీఎం చంద్రబాబు
- త్వరలో పోలవరం ప్రాజెక్టు పూర్తవుతుంది. కృష్ణా-గోదావరి నదుల అనుసంధానం జరుగుతుందన్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు
- రెండు తెలుగు రాష్ట్రాలు ఒకరినొకరు అర్థం చేసుకుని కలిసి ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని సీఎం చంద్రబాబు వివరించారు.
- ఈ నెల 7న ముఖ్యమంత్రి చంద్రబాబు పోలవరం పర్యటనకు వెళ్లనున్నారు



**వార్త సంధ్య, అమరావతి, జనవరి 05 :** గుంటూరులో నిర్వహిస్తున్న ప్రపంచ తెలుగు మహాసభల్లో సీఎం గోదావరి జలాల గురించి మాట్లాడారు. తెలుగువాళ్లు కలిసుంటే ఎన్నో సమస్యలు పరిష్కరించుకోవచ్చని సీఎం చంద్రబాబు తెలిపారు. ఎన్టీఆర్ హయాంలో ఉమ్మడి ఏపీలో పలు ప్రాజెక్టులు కట్టినట్లు వివరించారు. చంద్రబాబు నాయుడు హయాంలో తెలంగాణలో కల్వకుర్తి, ఏఎంఆర్, నెట్టెంపాడు పూర్తి చేశామని సీఎం గుర్తు చేశారు. భీమా ఎత్తిపోతల కూడా చంద్రబాబు హయాంలోనే పూర్తయిందని అన్నారు. గోదావరిపైనా ఉమ్మడి ఏపీలో అనేక ప్రాజెక్టులు కట్టామని, గతేడాది కృష్ణా, గోదావరి నుంచి 6 వేల టీఎంసీలు సముద్రంలోకి వెళ్లాయన్నారు. గోదావరి నీళ్లు వాడుకుంటే నేను ఎప్పుడూ అడ్డుచెప్పలేదన్నారు. విభజన తర్వాత కాళేశ్వరం కట్టినా గోదావరిలో చాలా నీళ్లున్నాయని అభ్యంతరం చెప్పలేదని సీఎం తెలిపారు. గోదావరిపై ఎన్ని ప్రాజెక్టులు కట్టినా ఫర్వాలేదని, రాష్ట్రానికి నీళ్లు వస్తాయని అనుకున్నానని సీఎం తెలిపారు. - మిగతా 2 లో

## వీసీలు కేవలం పరిపాలన అధిపతులు కాదు




- రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్
- వీసీలు సంస్కరణల రాయబారులుగా పనిచేయాలన్న లోకేశ్
- జ్ఞాన ఆధారిత సమాజ నిర్మాణంలో యూనివర్సిటీలదే కీలకపాత్ర అని వెల్లడి
- పాఠ్యాంశాలు, పరిశ్రమల అవసరాల మధ్య అంతరం తగ్గాలని వ్యాఖ్యలు
- బోధన, ఉపాధి, పరిశోధనలపై వీసీలకు 5 కీలక సూచనలు

**వార్త సంధ్య, అమరావతి, జనవరి 05 :** వైస్ ఛాన్సలర్లు (వీసీలు) కేవలం పరిపాలన అధిపతులుగా మిగిలిపోకూడదని, విద్యారంగాన్ని నడిపించే నాయకులుగా, సంస్కరణల రాయబారులుగా పనిచేయాలని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. జ్ఞాన ఆధారిత సమాజాన్ని నిర్మించడంలో విశ్వవిద్యాలయాల పాత్ర అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. సోమవారం అమరావతిలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ అధ్యక్షతన - మిగతా 2 లో

# సంపాదకీయం

## ఆధునిక విద్యాభారతి వైతాళికురాలు



మహిళలు, దళితులు, శూద్రులు చదువు పొందకూడదనే కఠినమైన సామాజిక ఆంక్షలు ఉన్న కాలంలో, వాటన్నిటినీ ఛేదించి విద్య మాత్రమే విముక్తికి మార్గమని నిరూపించిన ధైర్యశాలి సావిత్రి బాయి పూలే. అణచివేత, అవ మానం, అపహాస్యం వంటి ఎన్నో అవరోధాలను ఎదుర్కొం టూ కూడా సమానత్వం,మాన వత్వం, న్యాయం అనే విలువల కోసం ఆమె అలుపెరుగకుండా పోరాడారు. ఆమె దృష్టిలో చదువనేది కుల, లింగ వివక్ష నుంచి విముక్తి పొందే ఆయుధం. ఇలాంటి పోరాటాల ఫలితంగానే బాలికల విద్య, దళితుల చదువు, వితంతువుల జీవితాల్లో వెలుగు మొదలైనాయి. సావిత్రిబాయి పూలే కేవలం బోధనకే పరిమితం కాలేదు. అనాథల, వితంతువుల, రోగుల సేవలోనూ పాల్గొని ఉపాధ్యాయ వృత్తికి మానవీయ విలువలను జోడించారు. భారతీయ సమాజంలో అట్టడుగువర్గాల జీవితాల్లో ప్రత్యక్షంగా సంస్కరణలు తీసుకొచ్చిన తొలి వ్యక్తిగా ఆమెను పరిశీలిస్తే, సావిత్రిబాయి పూలే నిజమైన మొదటి సంఘసంస్కర్త. సమాజం కోసం జీవించి, సమాజం కోసం మరణించిన వ్యక్తి మాత్రమే అసలైన సంఘసంస్కర్త అవుతారు. ఆ ప్రమాణానికి పూర్తిగా సరిపోయిన తొలి వ్యక్తి ఆమె.సావిత్రిబాయి ఉద్యమం సమగ్ర మానవ విముక్తిని లక్ష్యంగా పెట్టుకుంది. మహిళ, శూద్రుడు, అతిశూద్రుడు అనే భేదాలను ఒక్కరీతిగా ప్రశ్నించిన సంస్కర్త ఆమె. సమకాలీన సంస్కర్తలు సమాజంలోని ఒక్కో అన్యాయాన్ని మాత్రమే ఎదుర్కొంటే, ఆమె మూల వ్యవస్థలనే ప్రశ్నించారు. అందుకే ఆమెను కేవలం ఒక మహిళా సంస్కర్తగా కాకుండా, భారతదేశంలోని అత్యంత విప్లవాత్మక సామాజిక సంస్కర్తగా గుర్తించాలి. నేటి మహిళా ఉపాధ్యాయులకు సావిత్రిబాయి నిజమైన ఆదర్శం. ఆమె ఉపాధ్యాయ వృత్తిని కేవలం ఉద్యోగంగా కాక, సమాజ మార్పునకు శక్తిమంతమైన సాధనంగా భావించారు. తీవ్రమైన సామాజిక వ్యతిరేకత, అవమానాలు ఎదురైనా బాలికల విద్య కోసం ధైర్యంగా ముందుకు సాగారు. ఆడపిల్లలకు చదువు అందితేనే సమాజం అభివృద్ధి చెందుతుందన్న దూరదృష్టితో బోధించారు. ప్లేగు వ్యాధి తీవ్రంగా వ్యాప్తి చెందుతున్న సమయంలో ఆయా రోగులకు సేవ చేస్తూ ప్రాణాలు కోల్పోవడం ఆమె త్యాగభావానికి పరాకాష్ఠ. నేటి మహిళా ఉపాధ్యాయులంతా సావిత్రిబాయిని ఒక చారిత్రక వ్యక్తిగా మాత్రమే కాక, వృత్తి నిబద్ధతకు, సామాజిక బాధ్యతకు నిదర్శనంగా చూడాలి. ఆమె జీవితాన్ని అనుసరించడం ద్వారా మాత్రమే ఉపాధ్యాయ వృత్తికి నిజమైన గౌరవం వస్తుంది.సావిత్రిబాయి పూలే జయంతిని ప్రభుత్వం అధికారికంగా జరపడం గౌరవప్రదమైన విషయమే. అయితే ఆమె ఆశయాలు కేవలం సభలు, ప్రసంగాలు, పూలమాలలకే పరిమితమైతే అది ఆమె చేసిన త్యాగానికి న్యాయం చేసి నట్లు కాదు. ఆమె జీవితమంతా ఆచరణాత్మక పోరాటమే; కాబట్టి ఆమెను స్మరించుకోవడం కూడా కార్యాచరణ రూపంలోనే ఉండాలి. మహిళా విద్య, దళిత వెనుకబడిన వర్గాల చదువు, సమానత్వం, ఆత్మగౌరవం. ఇవే సావిత్రిబాయి ప్రధాన లక్ష్యాలు. నేటి కాలంలో కూడా బాలికల డ్రాప్ అవుట్లు, విద్యలో అసమానతలు, సామాజిక వివక్ష కొనసాగుతూనే ఉన్నాయి. వీటిని నిర్మూలించేందుకు నాణ్యమైన ప్రభుత్వ పాఠశాలలు, బాలికలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు, పేద విద్యార్థులకు నిరంతర సహాయం వంటి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. విద్యను కేవలం డిగ్రీలకే పరిమితం చేయ కుండా, ప్రశ్నించే చైతన్యం, సామాజిక బాధ్యతను పెంపొందించేలా రూపొందించాలి. అప్పుడే సావిత్రి బాయి ఆలోచనలు సజీవంగా నిలుస్తాయి. అందువల్ల, ప్రభుత్వం సావిత్రిబాయి జయంతిని జరపడం కంటే, ప్రధానంగా ఆమె లక్ష్యాలను కొనసాగించే విధానాలు అమలు చేయడమే నిజమైన నివాళి అవుతుంది.

## అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నివాసంపై కాల్పులు

**మొదటిపేజీ తరువాయి** – ఈ ఘటనలో ఇంటి అద్దాలు ధ్వంసమయ్యాయి. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కాల్పులు జరిగిన సమయంలో జేడీ వాన్స్ కుటుంబం ఇంట్లో లేదని అమెరికా మీడియా తెలిపింది. నిందితుడు ఎందుకు కాల్పులు జరిపాడన్న దానిపై స్పష్టత లేదు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నివాసం వద్ద సోమవారం తెల్లవారుజామున కలకలం రేగింది. ఈ ఘటనకు సంబంధించి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. సీక్రెట్ సర్వీస్, సిన్సినాటి పోలీసులు సంయుక్తంగా ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు.వివరాల్లోకి వెళితే, ఒహాయో రాష్ట్రంలోని సిన్సినాటి నగరంలో సోమవారం అర్ధరాత్రి దాటాక సుమారు 12:15 గంటలకు జేడీ వాన్స్ నివాసం సమీపంలో ఒక వ్యక్తి అనుమానాస్పదంగా పరుగెడుతున్నట్లు సీక్రెట్ సర్వీస్ సిబ్బంది గుర్తించారు. వెంటనే వారు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, ఇంటి కిటికీ అద్దాలు పగిలిపోయి ఉండటాన్ని గమనించారు. ఈ ఘటనకు సంబంధించి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.అయితే, ఈ ఘటన జరిగిన సమయంలో ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఆయన కుటుంబ సభ్యులు ఇంట్లో లేరని అధికారులు స్పష్టం చేశారు. సెలవుల అనంతరం ఆదివారమే ఆయన వాషింగ్టన్ డీసీకి బయలుదేరి వెళ్లినట్లు తెలిసింది. అదుపులోకి తీసుకున్న వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించే ప్రయత్నం చేయలేదని ప్రాథమికంగా భావిస్తున్నారు. అతడు ఉపాధ్యక్షుడిని లక్ష్యంగా చేసుకుని ఈ చర్యకు పాల్పడ్డాడా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. ఈ ఘటనపై వైట్ హౌస్ లేదా సీక్రెట్ సర్వీస్ నుంచి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

## కోనసీమలో ఓఎన్జీసీ సైట్ వద్ద భారీ అగ్నిప్రమాదం

**మొదటిపేజీ తరువాయి** – వేస్తున్నారు.సమాచారం అందుకున్న వెంటనే రెవెన్యూ, పోలీస్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అధికారులు ముందుజాగ్రత్త చర్యగా ఇరుసుమండ గ్రామాన్ని పూర్తిగా ఖాళీ చేయించారు. చుట్టుపక్కల 5 కిలోమీటర్ల పరిధిలోని ప్రజలను కూడా సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఓఎన్జీసీ ఉన్నతాధికారులు, సాంకేతిక బృందాలు రాజమండ్రి నుంచి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించాయి.ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే స్పందించారు. మంత్రులు అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు, జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. ప్రజలకు ఎలాంటి ప్రమాదం జరగకుండా చూడాలని, బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని సీఎం ఆదేశించారు. మంటలను త్వరితగతిన అదుపు చేసేందుకు ఓఎన్జీసీతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఘటనపై ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని కోరారు. కాగా, ఉత్పత్తిని పెంచే పనుల్లో భాగంగానే ఈ లీకేజీ జరిగి ఉండవచ్చని అధికారులు ప్రాథమికంగా భావిస్తున్నారు.

## తెలంగాణలో నిరుద్యోగులకు గుడ్‌న్యూస్

**మొదటిపేజీ తరువాయి** – తెలంగాణలోని నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వ ఆసుపత్రులను సమూలంగా బలోపేతం చేస్తున్నట్లు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రకటించారు. రాష్ట్రంలో అత్యున్నత వైద్య సేవలందించే నిమ్స్ ఆసుపత్రిపై ఒత్తిడి తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి చెప్పారు. నిమ్స్‌లో అదనంగా 125 వెంటిలేటర్లు ఏర్పాటు చేయడంతో పాటు ఖాళీగా ఉన్న 850 ఉద్యోగాలను త్వరలోనే భర్తీ చేస్తామని సభకు హామీ ఇచ్చారు.శాసనసభ వేదికగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో పెరుగుతున్న నమ్మకానికి అనుగుణంగా అత్యాధునిక వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,790 వెంటిలేటర్ బెడ్లకు అదనంగా మరో 490 వెంటిలేటర్లను కొనుగోలు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. వీటిని గాంధీ, ఉస్మానియా, ఎంజీఎంతో పాటు జిల్లా ఆసుపత్రుల్లో ఏర్పాటు చేస్తామన్నారు.అలాగే, రోగ నిర్ధారణలో కీలకమైన 9 కొత్త ఎంఆర్ఐ యంత్రాలను వివిధ ప్రభుత్వ ఆసుపత్రులకు కేటాయిస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల పేదలకు ఖరీదైన పరీక్షలు ఉచితంగా అందుబాటులోకి వస్తాయని వివరించారు.అత్యవసర సేవలపైనా ప్రభుత్వం దృష్టి సారించిందని, కొత్త అంబులెన్స్‌ల రాకతో రెస్పాన్స్ సమయం 18 నిమిషాల నుంచి 13 నిమిషాలకు తగ్గిందని మంత్రి తెలిపారు. ఈ ఏడాది మరో 79 అంబులెన్స్‌లను ప్రవేశపెట్టి ఈ సమయాన్ని 10 నిమిషాలకు తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు.డయాలసిస్ రోగుల కోసం ప్రతి 25 కిలోమీటర్లకు ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇకపై బస్తీ దవాఖానాల్లో మందుల కొరత లేకుండా నేరుగా సెంట్రల్ స్టోర్స్ నుంచి సరఫరా చేసేలా కొత్త విధానం తెస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు.

## తెలంగాణలో మరో 17 మంది మావోయిస్టులు మాత్రమే ఉన్నారు

**మొదటిపేజీ తరువాయి** – గడువు లోపే తెలంగాణ మావోయిస్టు రహిత రాష్ట్రంగా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. నక్సలైట్లు జనజీవన స్రవంతిలో కలిస్తే పోలీసు శాఖ నుంచి వారికి అవసరమైన సహాయం అందుతుందని ఆయన అన్నారు.

## తెలుగు రాష్ట్రాల మధ్య విద్వేషం కాదు - సమైఖ్యత అవసరం

**మొదటిపేజీ తరువాయి** – గడచిన 40 ఏళ్లుగా 3 వేల టీఎంసీలు గోదావరి నుంచి సముద్రంలోకి పోతున్నాయన్నారు.త్వరలో పోలవరం ప్రాజెక్టు పూర్తవుతుంది. కృష్ణా–గోదావరి నదుల అనుసంధానం జరుగుతుంది. ప్రపంచంలో తక్కువ నీటి వినియోగం చేసే దేశం మన భారతదేశమే. ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్నా గంగా, కావేరి కలవాలి దేశంలో నీటి సమస్య పరిష్కారం కావాలి. ఏపీలో ఉండే నదులన్నీ అనుసంధానం కావాలి. తెలంగాణలో గోదావరి నీళ్లు కూడా వాడుకోవాల్సిన అవసరం ఉంటే వాడుకోవాలి. తెలుగు రాష్ట్రాల మధ్య విద్వేషాలు కాదు, సమైఖ్యత అవసరం.రెండు తెలుగు రాష్ట్రాలు ఒకరినొకరు అర్థం చేసుకుని కలిసి ముందుళ్లాల్సిన అవసరం ఉందని సీఎం చంద్రబాబు వివరించారు. ఎంతోమంది త్యాగాలు చేశారని, ఇది రాజకీయ వేదిక కాదని నీటి విషయంలో, సహకారంలో తెలుగువారంతా కలిసి ఉండాలని చంద్రబాబు అన్నారు. ప్రపంచంలో ఎక్కడ ఉన్నా మనల్ని గుర్తించే ఏకైక భాష తెలుగు భాష అని సీఎం కొనియాడారు.



**సాగునీటి ప్రాజెక్టుల బాట పట్టిన సీఎం – గడువులోగా నిర్మాణాల పూర్తిపై సమీక్ష**

మరోవైపు రాష్ట్రంలోని సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణ పనుల విషయం ముఖ్యమంత్రి చంద్రబాబు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్న విషయం విదితమే. ఈ క్రమంలోనే ఈ నెల 7న పోలవరం పర్యటనకు వెళ్లనున్నారు. ప్రాజెక్టు సందర్శన తో పాటు నిర్మాణ పనుల పురోగతి పైనా క్షేత్రస్థాయిలో సీఎం సమీక్షస్తారు. అదే రోజు విజయవాడలో సిద్ధార్థ అకాడమీ గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో సీఎం పాల్గొంటారు.ఇదిలా ఉండగా మరోవైపు ఇటీవల తెలంగాణ ప్రయోజనాల కోసం కూటమి ప్రభుత్వం రాయలసీమ లిఫ్ట్ పనులు నిలిపివేసిందన్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను ఆంధ్రప్రదేశ్ సర్కార్ తప్పుబట్టింది. తన విన్నపం మేరకు, తనపై గౌరవంతో చంద్రబాబు రాయలసీమ లిఫ్ట్ నిలిపి వేశారని తెలంగాణ సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలు అసంబద్ధం అని తెలిపిన సంగతి తెలిసిందే. జగన్ హయాంలో ఎటువంటి అనుమతులు లేకుండా నాటి ప్రభుత్వం రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టును చేపట్టిందని వెల్లడించింది. సీమకు రోజుకు 3 టీఎంసీల నీరు అంటూ భారీ ప్రకటనలతో అనుమతులు లేకుండా జగన్ పనులు చేపట్టారని, నాటి సీఎం జగన్ ప్రచారంతో రాయలసీమ లిఫ్ట్ పై తెలంగాణ ప్రభుత్వం కోర్టులో కేసులు వేసిన విషయాన్ని గుర్తు చేసింది.

## వీసీలు కేవలం పరిపాలన అధిపతులు కాదు

**మొదటిపేజీ తరువాయి** – జరిగిన పబ్లిక్ యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్ల సమీక్షా సమావేశంలో లోకేశ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.తన పాదయాత్రలో ఎంతో మంది యువతను కలిశానని, సర్టిఫికెట్లు చేతిలో ఉన్నా ఉద్యోగాలు లేక గందరగోళంలో ఉన్నారని లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే సవాళ్లతో కూడిన విద్యాశాఖను తీసుకున్నానని తెలిపారు. రాష్ట్రంలోని ఉన్నత విద్యలో ప్రధానంగా ఐదు అంశాలపై దృష్టి సారించాలని వీసీలకు దిశానిర్దేశం చేశారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా పాఠ్యాంశాల్లో మార్పులు తీసుకురావాలని, విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, ప్లేస్‌మెంట్‌లు పెంచి ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలని సూచించారు.“డిగ్రీలు పూర్తిచేసినా ఉద్యోగం రాక మన విద్యార్థులు అమీర్‌పేటలో శిక్షణ పొందితే కానీ ఉద్యోగం సాధించలేకపోతున్నారు. ఇది విద్యార్థుల వైఫల్యం కాదు, మన సంస్థల వైఫల్యం“ అని మంత్రి లోకేశ్ అన్నారు. పరిశోధనలు కేవలం ప్రచురణలకే పరిమితం కాకుండా సమాజానికి ఉపయోగపడేలా ఉండాలన్నారు. ప్రతి వారం విద్యార్థులతో నేరుగా మాట్లాడేందుకు ‘ఓపెన్ హౌస్‘ నిర్వహించాలని వీసీలను కోరారు. అందరి కృషితో రాష్ట్రంలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను ప్రపంచస్థాయి సంస్థలుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని లోకేశ్ స్పష్టం చేశారు.

**ఉన్నత విద్యలో 5 సవాళ్లు**

ప్రస్తుతం ఉన్నత విద్యారంగం ఐదు ప్రధాన సవాళ్లను ఎదుర్కొంటోందని మంత్రి లోకేశ్ విశ్లేషించారు.

1. బోధన-అవసరాల మధ్య అంతరం: పరిశ్రమల అవసరాలకు, మనం బోధిస్తున్న పాఠ్యాంశాలకు మధ్య తీవ్ర వ్యత్యాసం ఉంది. దీనివల్ల మన డిగ్రీలకు అంతర్జాతీయంగా డిమాండ్ తగ్గుతోంది. ప్రపంచ ప్రఖ్యాత స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ సైతం ఎప్పటికప్పుడు తమ పాఠ్యాంశాలను పూర్తిగా మారుస్తోందని, మనం కూడా కాలానుగుణంగా సిలబస్‌ను నవీకరించాలని సూచించారు.
2. ఉద్యోగావకాశాలు లేని డిగ్రీలు: ఇంటర్న్‌షిప్‌లు, ప్లేస్‌మెంట్ వ్యవస్థలు సరిగా లేకపోవడంతో మన డిగ్రీలకు విశ్వసనీయత కొరవడుతోంది. మన వర్సిటీల నుంచి పట్టభద్రులైన విద్యార్థులు ఉద్యోగాలు సాధించలేకపోతుండగా, అమీర్‌పేటలో నాలుగు నెలల శిక్షణతో ఉద్యోగాలు పొందుతున్నారని, ఇది విద్యార్థుల వైఫల్యం కాదని, మన విద్యాసంస్థల వైఫల్యమని స్పష్టం చేశారు.
3. ప్రయోజనం లేని పరిశోధనలు: పరిశోధనలు కేవలం ప్రచురణలకే పరిమితం కాకుండా, సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలుగా మారాలి. నీటికొరత, వాతావరణ మార్పులు వంటి సమస్యలకు వర్సిటీలు పరిష్కారాలు చూపాలి.
4. పరిపాలనా భారం: అధ్యాపకులు, వీసీలు బోధన కంటే పరిపాలనపైనే ఎక్కువ సమయం వెచ్చిస్తున్నారు. ఈ పాత పద్ధతులు వీడి, అకడమిక్ ప్రమాణాలపై దృష్టి సారించాలి.
5. విద్యార్థుల అనుభవంలో లోపాలు: విద్యార్థులకు సరైన మార్గదర్శకత్వం, మానసిక మద్దతు కొరవడుతోంది. దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

**భవిష్యత్ కార్యాచరణ ఇదే**



ఈ సవాళ్లను అధిగమించేందుకు పాత పద్ధతులను విడనాడి, విద్యావ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాలని లోకేశ్ పిలుపునిచ్చారు. రాబోయే పదేళ్లలో రానున్న ఉద్యోగాల్లో 80 శాతం ఇప్పటికి తెలియని రంగాల్లోనే ఉంటాయని, అందుకు తగ్గట్టుగా యువతను సిద్ధం చేయాలన్నారు. పరిశ్రమలతో అనుసంధానం పెంచి, ఇంటర్న్‌షిప్‌లు, అప్రెంటిస్‌షిప్‌లను తప్పనిసరి చేయాలన్నారు. వర్సిటీలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు పూర్వ విద్యార్థుల నెట్‌వర్క్‌ను వినియోగించుకోవాలని, ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇందుకు చక్కటి ఉదాహరణ అని తెలిపారు. ఈ సమావేశంలో హెచ్ఆర్‌డీ కార్యదర్శి కోన శశిధర్, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె.మధుమూర్తి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ పాల్గొన్నారు.

## మాతృభాష మన మూలాలకు సంకేతం

**మొదటిపేజీ తరువాయి** –

వివిధ కళాప్రక్రియలతో మూడో ప్రపంచ తెలుగు మహాసభల ప్రధాన వేదిక ప్రేక్షకులను మురిపిస్తున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు ప్రదర్శించిన నృత్య రూపకాలు, సామాజిక నాటకాలు, జానపద నృత్యాలు అలరిస్తున్నాయి. ప్రపంచ తెలుగు మహాసభల మూడో రోజు కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు తెలుగు భాషకు దేశంలోనే ఘనమైన చరిత్ర ఉందని అన్నారు.ఇలాంటి మహాసభలు తెలుగు భాష పరిరక్షణకు ఉపయోగపడతాయన్నారు. మాతృభాషలో రాణిస్తే ఏ రంగంలోనైనా రాణిస్తామన్నారు. త్యాగధనులను గుర్తు పెట్టుకుంటే స్ఫూర్తిదాయకంగా ఉంటుందని, నందమూరి తారక రామారావు ఆత్మగౌరవంతో ముందుకెళ్లారని, తెలుగు జాతి ఉన్నంతవరకు గుర్తుపెట్టుకునే ఏకైక నాయకుడు ఎన్టీఆర్ అని సీఎం కొనియాడారు.మాతృభాష మన మూలాలకు సంకేతమన్న సీఎం, అంగ్లం అవసరం కానీ భాషను మరచిపోతే మనల్ని మనమే కోల్పోయినట్లు అవుతుందన్నారు. టెక్నాలజీ వల్ల భాష కనుమరుగవుతుందన్నారు.టెక్నాలజీతో భాషను సులువుగా కాపాడుకోవచ్చని, కొత్త యాప్‌లు వచ్చాయని తెలుగులో మాట్లాడితే తెలుగులోనే సమాధానమిస్తాయని పేర్కొన్నారు. కనీసం టైప్ చేయడానికి తెలియనివాళ్లు కూడా ఈ టెక్నాలజీ ఉపయోగించుకునే పరిస్థితి వస్తుందన్నారు. పొట్టిశ్రీరాములు పేరుతో 1985లోనే ఎన్టీఆర్ తెలుగు వర్సిటీ తీసుకొచ్చారన్నారు. విభజన తర్వాత రాజమండ్రిలో పొట్టిశ్రీరాములు తెలుగు వర్సిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు.సంక్రాంతి కంటే ముందు వచ్చిన పండుగ ఇదని, వేదికకు తెలుగువారి ఆత్మగౌరవాన్ని చాటిచెప్పిన ఎన్టీఆర్ పేరు పెట్టడం సంతోషదాయకమని సీఎం హర్షం వ్యక్తం చేశారు. దేశంలోనే తెలుగు భాషకు ఘనమైన చరిత్ర ఉందని, వందలాది భాషలు ఉన్నా మన దేశంలో కేవలం ఆరు భాషలకు ప్రాచీన హోదా లభించిందన్నారు. ప్రాచీన హోదా లభించిన భాషల్లో తెలుగు ఉండటం మనందరికీ గర్వకారణమని, హిందీ, బెంగాలీ, మరాఠీ తర్వాత దేశంలో ఎక్కువ మాట్లాడే భాష తెలుగు అని, ప్రపంచం మొత్తంలో సుమారు 10 కోట్లమంది తెలుగు మాట్లాడుతున్నారని చంద్రబాబు వివరించారు.‘ఈ మహాసభలకు దాదాపు 40 దేశాల నుంచి ప్రతినిధులు వచ్చారు. ఇలాంటి మహాసభలు తెలుగు భాష పరిరక్షణకు ఉపయోగపడతాయి. గిడుగు వెంకట రామ్మూర్తిని తెలుగు జాతి ఎప్పటికీ మరవలేదు. నేను తెలుగువాణ్ని, నాది తెలుగుదేశం అని చాటిచెప్పిన ఏకైక నాయకుడు ఎన్టీఆర్. తెలుగు భాషాభివృద్ధికి కృషిచేస్తున్నవారికి, ప్రతిభ చూపిన వారికి పూర్ణకుంభ వంటి అవార్డులు ఇచ్చారు. 1949లో హైదరాబాద్‌లో ఆంధ్ర సారస్వత పరిషత్‌గా ఎదిగింది. 2017లో ఆంధ్ర సారస్వత పరిషత్‌కు మళ్లీ ఊపిరిపోశారు. 2022లో భీమవరంలో, 2024లో రాజమండ్రిలో మహాసభలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు నేతలు తెలుగు భాష కీర్తిని వివరిస్తూ తమదైన శైలిలో ప్రసంగించారు. పిల్లలు తెలుగు మాట్లాడేలా తల్లిదండ్రులు కూడా బాధ్యత తీసుకోవాలని శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు కోరారు. మూడో ప్రపంచ తెలుగు మహాసభల్లో పాల్గొన్న ఆయన తెలుగుభాష, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షణకు అందరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రాచీనకళలు కాపాడేం దుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.2 వేల సంవత్సరాల చరిత్ర కలిగిన భాష మన తెలుగు అని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. గుంటూరులో జరుగుతున్న మూడో ప్రపంచ తెలుగు మహా సభల్లో ఆయన పాల్గొన్నారు. ఇలాంటి సభలు తెలుగు భాష ఉనికిని కాపాడుతాయని, ఔన్నత్యాన్ని చాటి చెబుతాయని వివరించారు.తరతరాల మధ్య కుటుంబ బంధాలను భాష బలపరుస్తుందని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. మూడో ప్రపంచ తెలుగు మహాసభల్లో పాల్గొన్న ఆయన తెలుగు భాష పరిరక్షణకు అందరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. ఆంగ్లం నేర్చుకోవడం తప్పుకాదు తెలుగు మరచిపోవడం తప్పేనని కేంద్రమంత్రి పెమ్మసాని వ్యాఖ్యానించారు.

## వెనెజువెలా అధ్యక్షుడికి పుట్టపర్తితో బలమైన బంధం

**మొదటిపేజీ తరువాయి** – ఇటీవలే అమెరికా దళాలకు పట్టుబడిన వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోకు ఏపీతో ఒక బలమైన ఆధ్యాత్మిక అనుబంధం ఉంది. ప్రపంచవ్యాప్తంగా నియంతగా ముద్రపడిన మదురో, పుట్టపర్తి సత్యసాయి బాబాకు వీరాభిమాని కావడం చాలామందికి తెలియని విషయం. క్యాథలిక్‌గా పెరిగినప్పటికీ, మదురోకు తన భార్య సిలియా ఫ్లోర్స్ ద్వారా భారతీయ ఆధ్యాత్మిక గురువు సత్యసాయి బాబా పరిచయమయ్యారు. వారిద్దరూ సాయిబాబా అనుచరులుగా మారి, 2005లో పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయాన్ని సందర్శించి, సత్యసాయి బాబాతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆ సమయంలో బాబాతో పాటు వారు నేలపై కూర్చున్న ఫొటో కూడా ఉంది.మదురో అధికారంలోకి వచ్చాక కూడా ఈ ప్రభావం కొనసాగింది. ఆయన తన కార్యాలయంలో సాయిబాబా చిత్రపటాన్ని ప్రముఖంగా ఉంచుకునేవారని కథనాలున్నాయి. 2011లో సాయిబాబా








మరణించినప్పుడు, అప్పటి విదేశాంగ మంత్రిగా ఉన్న మదురో చొరవతో వెనెజువెలా జాతీయ అసెంబ్లీ సంతాప తీర్మానం చేసింది. దేశంలో ఒకరోజు జాతీయ సంతాప దినంగా ప్రకటించి, బాబా ఆధ్యాత్మిక సేవలను గుర్తించింది.మదురో పాలనలో చాలా విదేశీ సంస్థలు వెనిజులాను విడిచి వెళ్లినా, సత్యసాయి సంస్థ కార్యకలాపాలు మాత్రం నిరాటంకంగా కొనసాగాయి. 2025 నవంబర్‌లో పట్టుబడటానికి కేవలం కొన్ని నెలల ముందు కూడా సాయిబాబా శతజయంతి సందర్భంగా ఆయనను స్మరించుకున్నారు. బాబాను ‘జ్యోతిర్మయ స్వరూపుడు‘ అని అభివర్ణించారు. “మేము కలిసినప్పుడు నేను ఆయనను ఎప్పుడూ గుర్తుంచుకుంటాను... ఆ గొప్ప గురువు జ్ఞానం మనల్ని నిరంతరం ప్రకాశవంతం చేయాలి“ అని ఆయన పేర్కొన్నారు. రాజకీయంగా ఎన్ని ఒడిదొడుకులు ఎదుర్కొన్నప్పటికీ, పుట్టపర్తితో, సాయిబాబాతో మదురోకున్న ఆధ్యాత్మిక బంధం చివరి వరకూ కొనసాగడం గమనార్హం.

## వ్యక్తిగా వెళుతున్నా... రాజకీయ శక్తిగా తిరిగి వస్తా

**మొదటిపేజీ తరువాయి** – రాజకీయ పునరావాస కేంద్రంగా మారిందని ఆమె ఆరోపించారు.రాష్ట్రంలో ఒక కొత్త రాజకీయ వేదిక రాబోతుందని, విద్యార్థులు, నిరుద్యోగులు, అన్ని వర్గాల కోసం తాను పనిచేస్తానని హామీ ఇచ్చారు. “అవమాన భారంతో పుట్టింటి నుంచి అన్ని బంధనాలు తెంచుకుని మీకోసం వస్తున్నా.. ఆశీర్వదించండి. తెలంగాణ జాగృతి రాజకీయ పార్టీగా మారుతుంది“ అని ఆమె పేర్కొన్నారు.సభ నుంచి బయటకు వచ్చాక కవిత మీడియాతో మాట్లాడారు. ఉద్యమకారుల కోసం, వారి ఆశయాల కోసం తెలంగాణ జాగృతి పార్టీ పనిచేస్తుందని అన్నారు. ఉద్యమకారులను, అమరవీరుల కుటుంబాలను తెలంగాణ జాగృతిలోకి ఆహ్వానిస్తున్నానని ఆమె అన్నారు. అవినీతి, రైతుల మీద కేసులు, బీఆర్ఎస్ సొంత నాయకులపై కేసులు, ఇంకా మరెన్నో బీఆర్ఎస్‌లో జరిగిన అక్రమాల గురించి తాను అధినాయకత్వం దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని అన్నారు.కుట్రదారులు, తెలంగాణ ద్రోహులు గెలిచారని మండిపడ్డారు. కానీ బీఆర్ఎస్ కోసం కడుపు కట్టుకుని పని చేసిన ఏ నాయకుడు ఉండలేకపోయారని అన్నారు. తాను ఊరుకునే వ్యక్తిని కాదని, కొట్లాడే ఆడబిడ్డనని అన్నారు. నాడు బీఆర్ఎస్ పార్టీ చేసిన అన్యాయాన్ని నేడు కాంగ్రెస్ కూడా కొనసాగిస్తోందని ఆరోపించారు. అందుకే తెలంగాణలో ఒక రాజకీయ వేదిక అవసరమని, తెలంగాణ జాగృతి ఆ ఖాళీని పూర్తి చేస్తుందని అన్నారు.ఒక ఆడబిడ్డగా మీ ముందుకు వస్తున్న తనను



ఆదరించమని ఆమె కోరారు. ఎప్పుడైనా కొత్త రాజకీయ శక్తి వస్తున్నప్పుడు ఇష్టారీతిన ఆరోపణలు చేయడం సహజమే అన్నారు. తాను బీఆర్ఎస్‌లో వాటాలు కుదరక బయటకు వచ్చానని కాంగ్రెస్ అంటోందని, తనతో కాంగ్రెస్ మాట్లాడుతోందని బీఆర్ఎస్ చెబుతోందని, కానీ ఆ వాదనల్లో వాస్తవం లేదని అన్నారు. తనకు దైవభీతి ఎక్కువ అని, లక్ష్మీనరసింహస్వామి మీద ప్రమాణం చేసి చెబుతున్నానని, తనది ఆస్తుల పంచాయితీ కాదని, రాజకీయ పంచాయితీ అని అన్నారు. తాను బీసీల గురించి, అవినీతి గురించి మాట్లాడానని గుర్తు చేశారు. మండలి ఛైర్మన్ తన రాజీనామాను ఆమోదిస్తే ప్రజల కోసం పూర్తిగా పోరాడతానని అన్నారు.

# నిధుల దుర్వినియోగంపై మాజీ సర్పంచ్ , కార్యదర్శి పై చర్యలు తీసుకోవాలి

### డీపీవోకు ఫిర్యాదు



**మునుగోడు, జనవరి 5 (వార్త సంధ్య):** మునుగోడు మండలం పలివెల గ్రామపంచాయతీలో రెండు కోట్ల రూపాయలకు పైగా నిధుల దుర్వినియోగం జరిగిందని ఆరోపిస్తూ,అప్పటి సర్పంచ్ గజ్జల బాలరాజ్ గౌడ్‌తో పాటు గ్రామపంచాయతీ కార్యదర్శి మానసపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ పలివెల గ్రామపంచాయతీ నూతన పాలకవర్గం మరియు గ్రామస్తులు సోమవారం నల్గొండ జిల్లా కేంద్రంలో జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో)కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్,వార్డు సభ్యులు,గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగకపోయినా,అభివృద్ధి పేరుతో నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. అప్పటి సర్పంచ్ గజ్జల బాలరాజ్ గౌడ్,పంచాయతీ కార్యదర్శి మానస ఇద్దరూ కలిసి అవినీతికి పాల్పడ్డారని పేర్కొన్నారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపి, దుర్వినియోగమైన నిధులను రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గ్రామంలో నకిలీ బిల్లులు, ఇంటి పన్ను నల్ల బిల్లుల పేరుతో ప్రజల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడ్డారని ఆరోపిస్తూ,పంచాయతీ కార్యదర్శి మానసను వెంటనే విధుల నుంచి తొలగించాలని విజ్ఞప్తి చేశారు. అధికార యంత్రాంగం స్పందించకపోతే త్వరలోనే పల్లె గ్రామపంచాయతీ కార్యాలయం,మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చెరుకు సునీత సైదులు,వార్డు సభ్యులు బత్తుల వెంకన్న, ఆనగంటి కృష్ణ,బత్తుల ప్రవీణ్, గోసుకొండ మల్లేష్,గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బాసరాజు యాదగిరి,ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు చోల్లేటి నరసింహచారి,కొండూరి మల్లికార్జున్, వరికుప్పల శంకర్,చెరుపల్లి రాము తదితరులు ఉన్నారు.

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి..

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

### ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించిన జిల్లా కలెక్టర్



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, జనవరి 05 (వార్త సంధ్య)** :అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ డి.వేణు తో కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. రామగిరి మండలం రత్నాపూర్ గ్రామానికి చెందిన ఇండ్ల కొమురయ్య ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పీడీ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎలిగేడు మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన తుమ్మల సుధాకర్ రెడ్డి గ్రామ శివారులోని సర్వే నెంబర్ 204 లో 20 గుంటల విస్తీర్ణ భూమి ఇతరులకు పేరు మీద ఉందని దానిని తన పేరు కు నమోదు చేయాలని కొరుతూ దరఖాస్తు చేసుకోగా ఎలిగేడు తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. మంథని మండలం గుంజపడుగు గ్రామానికి చెందిన ఇందారపు శంకరమ్మ డిసెంబర్ 20, 2025 న ఇల్లు కాలిపోయిందని , తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఎంపిడిఓ మంథని కు రాస్తూ వెంటనే పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. రామగుండం మండలం అడ్డగుంటపల్లి గ్రామానికి చెందిన ఉమ్మగాని సమ్మయ్య తన పేరు మీద ఉన్న గుంట భూమి కోసం తన కుమారుడు భౌతిక దాడి చేస్తున్నాడని, తనను రక్షించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఆర్డీవో పెద్దపల్లి రాస్తూ వృద్దుల సంరక్షణ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా పటిష్ట కార్యాచరణ అమలు...

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

### యూరియా సరఫరా పట్ల రైతులలో ఏ.ఈ.ఓ లు భరోసా కల్పించాలి

### యూరియా సరఫరా, యాసంగి కు సాగు నీటి సరఫరా పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, జనవరి 05( వార్త సంధ్య ) :** చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందేలా పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో యూరియా సరఫరా, యాసంగి కు సాగు నీటి సరఫరా పై సంబంధిత అధికారులతో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,ఏప్రిల్ 8,2026 వరకు 7 తడులలో యాసంగి పంటకు ఎస్సారెస్పీ నుంచి సాగునీరు విడుదల అవుతుందని, 7 రోజుల పాటు జగిత్యాల జిల్లాకు, 8 రోజుల పాటు పెద్దపెల్లి జిల్లాకు సాగు నీరు అందుబాటులో ఉంటుందని అన్నారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నీరు అందుబాటులో ఉందని, నీటిని సమర్థవంతంగా వినియోగించు కుంటూ చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందేలా చూడాలని, ఇతర జిల్లా అధికారులతో సమన్వయం చేసుకుంటూ పని చేయాలని, ఎక్కడ నీటి వృధా ఉండడానికి వీలు లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆఖరి తడులలో సాగునీటి ఇబ్బందులు రాకుండా ముందుగానే ప్రణాళిక బద్దంగా పని చేయాలని, సాగు నీటి విడుదల గురించి రైతులకు ఎప్పటి కప్పుడు వ్యవసాయ విస్తరణ అధికారుల ద్వారా సమాచారం అందించాలన్నారు. రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు దిశగా దృష్టి సారించేలా వ్యవసాయ అధికారులు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని సాగునీటికి ఎక్కడ రైతులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. డీ-83, డీ-86 కాలువలలో ఎక్కడైనా అవసరమైన చిన్న చిన్న మరమ్మత్తులు అవసరం ఉంటే వెంటనే చేపట్టాలని కలెక్టర్ సూచించారు. సాగునీటి కాలువల నుంచి నీటి డైవర్షన్ చేయడానికి వీలు లేదని, ఎటువంటి ఒత్తిడి వచ్చిన సాగు నీరు సరిగ్గా వెళ్ళేలా చూడాలని అన్నారు. ప్రతి రైతుకు సమృద్ధిగా యూరియా అందుబాటులో ఉందని , స్టాక్ లో ఎటువంటి కొరత లేనందున రైతులందరికీ యూరియా పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. రాబోయే 10 రోజులకు మించి అవసరమైన స్టాక్ అందుబాటులో ఉందని, రైతులు ఎవరు ఆందోళన చెందకుండా వారిలో భరోసా కల్పించాలని కలెక్టర్ వ్యవసాయ విస్తరణ అధికారులను ఆదేశించారు. ప్రతి వ్యవసాయ సహకార సంఘం, ప్రైవేట్ డీలర్ వద్ద ఉన్న యూరియా స్టాక్ వివరాలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, యూరియా స్టాక్ ఎక్కడ అందుబాటులో ఉంది అనే అంశం రైతులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని అన్నారు. రైతులతో వ్యవసాయ అధికారులు నేరుగా సంప్రదింపులు జరపాలని, ప్రస్తుత స్థితిగతులను ఎప్పటికప్పుడు తెలియజేస్తూ అపోహలను తొలగించాలని కలెక్టర్ తెలిపారు. పెద్దపెల్లి జిల్లాలో ఎక్కడ కూడా పోలీసుల అవసరం రాకుండా యూరియా పంపిణీ చేయాలని కలెక్టర్ వ్యవసాయ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్, నీటిపారుదల శాఖ డివిజనల్ ఇంజనీర్ కే. శ్రీనివాస్ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అధికారిక చిహ్నమైన రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు

### మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు



**కృష్ణా జిల్లా బ్యూరో జనవరి 05 వార్త సంధ్య :** ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని, రాష్ట్రప్రభుత్వం అధికారిక చిహ్నమైన రాజముద్రతో భూమి యాజమాన్య హక్కులను ధ్రువీకరిస్తూ పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీకి శ్రీకారం చుట్టిందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. మైలవరం మండలంలోని దాసుళ్లపాలెం గ్రామంలో నూతన పట్టాదారు పాసుపుస్తకాలను ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు సోమవారం రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ భూముల రీసర్వే పూర్తయిన గ్రామాల్లో కొత్త పట్టాదారు పాస్ బుక్ ల పంపిణీని ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. భూమే ప్రాణంగా బతికే రైతులకు భూ సమస్యలు లేకుండా చేయడం మన ప్రధాన లక్ష్యమన్నారు. రీ సర్వే తప్పులను సరిదిద్ది కొత్త పాసుపుస్తకాలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు భూ వివాదాలు లేకుండా చేయడం అనేది ప్రథమ కర్తవ్యం కావాలన్నారు. ఎన్నికల హామీలో భాగంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్త కాల పంపిణి చేస్తామని, రైతులకు భరోసా కల్పి స్తామని హామీ ఇచ్చిందన్నారు. అందుకు అనుగుణంగా జనవరి 2 నుంచి పంపిణీకి కావాల్సిన నూతన పుస్తకాలను రెవెన్యూ శాఖ సిద్ధం చేసిందన్నారు. గతంలో ఇచ్చిన 21.86 లక్షల భూ హక్కు పత్రాల స్థానంలో రాజముద్రతో కొత్త పాటు క్యూఆర్ కోడ్ తో పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. కొత్త పాస్ బుక్స్ ను బయోమెట్రిక్ విధానం ద్వారా అందజేస్తున్నారని, దీని ద్వారా ఈ కేవైసీ పూర్తి కాని వారికి సమస్య లేకుండా ఉంటుందన్నారు. పుస్తకాలు అందాయంటూ లబ్ధిదారులతో సంతకాలు తీసుకోవడంతో పాటు ఇది ఒక రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నూతన పాస్ పుస్తకాలు పంపిణీ సమయంలో కూడా పట్టాదారుని వివరాలు తప్పుగా నమోదైతే వాటిపై తక్షణ చర్యలకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. తహసీల్దార్ల లాగిన్ ద్వారా లబ్ధిదారుల ఆధార్, ఇతర వివరాల్ని పరిశీలించి పుస్తకాల్లోని తప్పుల్ని అక్కడికక్కడే సరిదిద్దేలా ఏర్పాట్లు చేశామన్నారు. భూమి విస్తీర్ణం తప్పుగా నమోదైనా, చనిపోయిన వారి పేరుతో పాసు పుస్తకాల విడుదలైన వాటిని సరి చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ) , ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# ఏటిసి నైపుణ్య శిక్షణ కోర్సుల ద్వారా ఉపాధి...

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

### అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, జనవరి 05( వార్త సంధ్య ) :** ఏటిసి నైపుణ్య శిక్షణ కోర్సుల ద్వారా యువతకు తప్పనిసరిగా ఉపాధి లభిస్తుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి ఐటిఐ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఏటిసి సెంటర్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, ఏటిసి, ఐటిఐ సెంటర్ ద్వారా అందిస్తున్న కోర్సుల వివరాలు, కోర్సు పూర్తి చేసుకున్న తర్వాత ఎంత మంది యువతకు ఉపాధి అవకాశాలు లభించాయి, వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరం ప్రారంభించిన ఏ.టి.సి సెంటర్ లో సంవత్సరం శిక్షణ పూర్తి చేసుకున్న దాదాపు 70 మంది ఉద్యోగులకు ఉపాధి లభించడం జరిగిందని అన్నారు. టాటా సంస్థ సౌజన్యంతో షార్ట్ టర్మ్ కోర్సుల ఏర్పాటు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు ఏటిసీ కోర్సులు పొందేందుకు అర్హులని ,ఈ కోర్సులతో మల్టి నేషనల్ కంపెనీలలో తప్పనిసరిగా ఉద్యోగం లభిస్తుందని కలెక్టర్ తెలిపారు. మన జిల్లాలో ఒక సంవత్సరం కాలపరిమితి గల మ్యాను ఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ & డిజిటల్ మ్యాను ఫ్యాక్చరింగ్ టెక్నీషియన్, ఆర్టీసీ యూజింగ్ అడ్వాన్స్ టూల్ కోర్సులలో 40 సీట్లు ఉన్నాయని, రెండు సంవత్సరాల కాల పరిమితి గల బేసిక్ డిజైనర్ అండ్ వర్చ్యుయల్ వెరిఫైర్(మెకానికల్), అడ్వాన్సుడ్ సి.ఎన్.సి మిషనింగ్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్ కోర్సులలో 24 సీట్లు ఉన్నాయని తెలిపారు.

ప్రస్తుతం మార్కెట్ డిమాండ్ ప్రకారం టాటా కన్సల్టిస్ వారితో సమన్వయం చేసుకొని ఈ కోర్సులను డిజైన్ చేశామని అన్నారు. జిల్లాలో ఉన్న యువత యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని కోర్సులలో జాయిన్ కావాలని కలెక్టర్ కోరారు.

అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ కోరారు. అడ్వాన్స్ టెక్నాలజీ కేంద్రంలో ప్రవేశాలకు కనీస వయసు 14 సంవత్సరాలు మాత్రమేనని అన్నారు.

ఈ పర్యటనలు జిల్లా కలెక్టర్ వెంట ప్రిన్సిపాల్ వెంకట్ రెడ్డి, ట్రైనింగ్ అధికారులు శ్రీనివాసు, మల్లికార్జున్, సూపరింటెండెంట్ కృష్ణ వేణి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ తిరుపతమ్మ తల్లి రంగుల మహోత్సవం

### పరివార దేవతలతో బయలెల్లిన అమ్మవారు

**జగ్గయ్యపేట జనవరి05 (వార్తాసంధ్య ప్రతినిధి)**

శ్రీ గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారు రంగుల మహోత్సవం సందర్భంగా పరివారదేవతలతో కలిసి సోమవారం ఉదయం బయలుదేరారు. సంప్రదాయ వైభవాన్ని ప్రతిబింబించేలా నృత్య విన్యాసాలు, మేళతాళాల నడుమ, శాస్త్రోక్త విధానాలతో కన్నుల పండుగగా ప్రారంభమైంది. ఈ ఉత్సవంలో మాజీ మంత్రి, కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం పాల్గొని అమ్మవారి ఆశీస్సులు స్వీకరించారు

రెండు రోజులపాటు సాగే ఈ మహోత్సవాన్ని ఆలయ ఈవో మహేశ్వర్ రెడ్డి, పెనుగంచిప్రోలు ఆలయ మాజీ చైర్మన్ నూతలపాటి కేశవ, ఉత్సవ కమిటీ చైర్మన్ చుంచు రమేష్ వెగినేటి గోపాలకృష్ణమూర్తి దివెళ్ల వంశీ కృష్ణ,కోట ఝాన్సన్, ఖంబం చిరంజీవి, కాట్రగడ్డ మధు,నలమోలు శివరామ ప్రసాద్, నూతలపాటి వెంకటేష్, కొతపల్లి సతీష్ పాటు ఆలయ అధికారులు,ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షణ చేస్తూ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు.

# పారిశుద్ధ్యంపై ఫోకస్.. ప్రజల్లో చైతన్యం

### ముమ్మరంగా జీహెచ్ఎంసీ ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్





**హైదరాబాద్, జనవరి 05 (వార్త సంధ్య):** గ్రేటర్ హైదరాబాద్ నగరాన్ని మరింత శుభ్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో 300 వార్డులలో చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోంది. ఒక్కో రోజు ఒక్కో అంశంపై ఫోకస్ చేస్తూ ప్రజలను చైతన్యపరచే దిశగా ఈ కార్యక్రమం ముందుకు సాగుతోంది. ఏడో రోజైన సోమవారం ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల వద్ద పేరుకుపోయిన వ్యర్థాల తొలగింపు, క్లీనింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించి పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జిల శుభ్రతతో ప్రారంభమైన ఈ ప్రత్యేక కార్యక్రమం, గడిచిన ఏడు రోజుల్లో ఫ్లై ఓవర్లు, రోడ్డు పక్కలు, డివైడర్లు, సెంట్రల్ మీడియన్లు, కర్బ్ స్టోన్లు, చెరువులు, నాలాలు, ఫుట్‌పాత్‌లు, పార్కులు, అలాగే నిర్మాణకూల్చివేత (జ&ఱ) వ్యర్థాల తొలగింపును విస్తృతంగా చేపట్టింది. జీహెచ్ఎంసీ పరిధిలోని 300 వార్డులలో మొత్తం 1579 ప్రాంతాలు, గార్బేజ్ వల్నరబుల్ పాయింట్లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, ఫ్లై ఓవర్లు, పార్కుల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించగా, ఇప్పటి వరకు అదనంగా 1663 మెట్రిక్ టన్నుల చెత్త, 617 మెట్రిక్ టన్నుల నిర్మాణ వ్యర్థాల తరలింపు పూర్తయ్యింది. ఈ ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు క్షేత్ర స్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ కార్యక్రమం ప్రభావవంతంగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు.

# ఉపసర్పంచ్ కాసం నగేష్ గుప్తాను సన్మానించిన గుండాల మండల ఆర్యవైశ్య సంఘం సభ్యులు



**యాదాద్రి భువనగిరి జిల్లా, జనవరి05(వార్త సంధ్య)** యాదాద్రి జిల్లా గుండాల మండలం సుద్దాల గ్రామానికి చెందిన కాసం నగేష్ గుప్తా ఇటీవల జరిగిన పంచాయితీ ఎన్నికల్లో ఉపసర్పంచ్ గా ఎన్నికైన సందర్భంగా గుండాల మండల ఆర్య వైశ్య ప్రజానీకం ఆయన్ని శాలువాతో సత్కరించడం జరిగింది , మండల కేంద్రంలోని వాసవి గార్డెన్ లో శ్రీరంగం నర్సయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వారితో పాటు దుబ్బ కోటేశ్వర గుప్తా, శామిషెట్టి శ్రీనివాస్, సతీష్, బజ్జూరి నాగరాజు, కిరణ్, అప్పిషెట్టి రాములు, గజ్జి నాగరాజు, అమరవాది సోమన్న, వెంకన్న, బుక్క సుధాకర్, యాదగిరి, సంతోష్,కృష్ణమూర్తి,బాలరాజు కాసం సత్తయ్య, నాగబండి సత్తయ్య, కొత్త గణేష్, రమేష్, తల్లం యాదగిరి మండల ఆర్య వైశ్యులు పాల్గొన్నారు

# మానవత్వం చాటుకున్న ముస్త్యాల యువత...!

### మానవసేవే మాధవసేవా..



**మంథని జనవరి 5(వార్త సంధ్య ) :** పెద్దపెల్లి జిల్లా రామగిరి మండలం ముస్త్యాల గ్రామంలో ఇటీవల చనిపోయిన గోసిక సురేష్ కుటుంబాన్ని ముస్త్యాల గ్రామ యువత పరామర్శించి వారికి ఆర్థిక సహాయం కింద 35వేల రూపాయలను అందజేశారు. ఆపదలో ఉన్న వారికి అండగా నిలవాలని సంకల్పంతో నేనున్నానని ముందుకొచ్చిన యువ డైనమిక్ లీడర్ కొమిరినేని మనోహర్ రావు తను ముస్త్యాల చేయూత అనే ఒక గ్రూపు తయారు చేసి గ్రూప్ సభ్యులందరి సహకారంతో మా వంతుగా బాధిత కుటుంబానికి 35వేల రూపాయలు అందజేశామని ఈ కార్యక్రమానికి సహకారం అందించిన ముస్త్యాల గ్రామ చేయూత గ్రూప్ సభ్యులందరికీ పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జంబోజ రాజేందర్,బెల్లంకొండ కనకయ్య, సిద్ధ శేఖర్, సుందిళ్ళ కృష్ణ, బెల్లంకొండ ప్రసాద్, బొంతల శ్రావణ్, జక్కుల రక్షిత్, కాల్వల సాయి, ఉదురుకోట కుమార్, గుర్రం మహేష్, మెరుగు మల్లేష్,బుపెల్లి ప్రేమ్,కోమిరినేని సాయి,ఎల్లోల మల్లేష్,జనగాం అనిల్ రమేష్,మరియు తదితరులు పాల్గొన్నారు.

# జనవరి 7న ఉపాధి కోర్సులపై అవగాహన సదస్సు

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, జనవరి 05( వార్త సంధ్య ):** జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు 100% జాబ్ గ్యారెంటీతో అందించే వివిధ ఉపాధి కోర్సుల గురించి జనవరి 7న సమీకృత జిల్లా కలెక్టరేట్లో అవగాహన సదస్సు నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచితంగా నైపుణ్య శిక్షణతో పాటు 100% జాబ్ గ్యారంటీ తో ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం,ఎల్ఎస్.సి & రెడింగటన్ ఆధ్వర్యంలో స్కిల్ ఇండియా సర్టిఫికేషన్ తో ఉపాధి కోర్సులు అందించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. 10వ తరగతి, ఇంటర్ పాసైన అభ్యర్థులకు రియల్ టైం ఫార్క్ లిఫ్ట్ ఆపరేటర్ అనే 38 రోజుల వ్యవధి గల కోర్సు, ఇంటర్ ఉత్తీర్ణత తో ఫోర్ వీలర్ డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న అభ్యర్థులకు 53 రోజుల విభక్తి గల సప్లై అసోసియేట్ కోర్సు ఉచితంగా అందించడం జరుగుతుందని, కోర్స్ తో పాటు ఉచిత భోజన వసతి సౌకర్యం, పరిశ్రమల పరిశీలన, స్కిల్ ఇండియా సర్టిఫికెట్,100% జాబ్ గ్యారెంటీ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. 19 నుంచి 28 సంవత్సరాల వయసు గల నిరుద్యోగ యువతీ, యువకులు వార్షిక ఆదాయం మూడు లక్షల లోపు ఉన్న వారందరూ ఉచిత శిక్షణ కోర్సు కు హాజరు కావచ్చని, ఈ కోర్సుల పట్ల అవగాహన కార్యక్రమం జనవరి 7న సమీకృత జిల్లా కలెక్టరేట్ లో నిర్వహిస్తున్నామని, జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు..

# 2026 నూతన సంవత్సరం సందర్భంగా సమైక్య ప్రెస్ క్లబ్ సభ్యుల సమావేశం



**తిరువూరు, జనవరి 05 (వార్త సంధ్య) :** యన్టీఆర్ జిల్లా తిరువూరు బోసుబొమ్మ సెంటర్‌లోని సమైక్య ప్రెస్ క్లబ్ కార్యాలయంలో 2026 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని విలేకర్ల సమావేశం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులు మద్దిబోయిన నరేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మద్దిబోయిన నరేష్ మాట్లాడుతూ, రానున్న రోజుల్లో క్లబ్ సభ్యులందరూ సమిష్టిగా కృషి చేసి సమైక్య ప్రెస్ క్లబ్‌ను మరింత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధిలా పని చేయాలనీ, ఎలాంటి సమస్యలు ఎదురైనా క్లబ్ కార్యక్రమాలు నిర్విరామంగా కొనసాగాలన్నారు. ఒకరిని ఒకరు గౌరవించుకుంటూ, ఎవరూ ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా కలిసికట్టుగా పనిచేయాలని సభ్యులు తీర్మానించారు. క్లబ్ ఉపాధ్యక్షులు సిరికొండ నాగేశ్వరరావు (అభి) మాట్లాడుతూ, క్లబ్ నియమాలను అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అక్రమ వసూళ్లకు పాల్పడే వ్యక్తుల సభ్యత్వాన్ని రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అధ్యక్షులు మద్దిబోయిన నరేష్, ఉపాధ్యక్షులు సిరికొండ నాగేశ్వరరావు (అభి), సెక్రటరీ మడిపల్లి రాంబాబు, గుగులోతు అశోక్, జరపాల ప్రకాష్, కోలా సునీల్, మల్లాది ప్రశాంత్, వేల్పుల మాధవరావు, మర్సకట్ల దిలీప్, రాయపూడి నాగముత్యం, తాటికొండ సత్యనారాయణ, షేక్ అహ్మద్, మర్సకట్ల కృష్ణవేణి, సిరికొండ వరలక్ష్మి, మారపోగు రవి తదితరులు పాల్గొన్నారు.

# పల్లె పండుగ 2.0 ద్వారా గ్రామీణ అభివృద్ధి

## గౌరవరం గ్రామంలో రూ.61 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులులి

## సీసీ రోడ్లు, గోకులం షెడ్డుల ప్రారంభం

## నూతన రోడ్లకు శంకుస్థాపన






**జగ్గయ్యపేట జనవరి 05 వార్త సంధ్య** : రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పల్లె పండుగ 2.0 కార్యక్రమంలో భాగంగా జగ్గయ్యపేట మండలం గౌరవరం గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం శ్రీ రఘురామ్ , శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామంలో రూ.16 లక్షల వ్యయంతో నిర్మించిన గోకులం షెడ్డులను, అలాగే రూ.30 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను రఘురామ్, తాతయ్య రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. అనంతరం రూ.15 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారుఈ సందర్భంగా పెద్దలు మాట్లాడుతూ

గౌరవరం గ్రామంలో మొత్తంగా రూ.61 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులు గ్రామ మౌలిక వసతులను మరింత బలోపేతం చేయనున్నాయని, గ్రామ ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలనే సంకల్పంతో పనిచేస్తోంది. గతంలో నిర్లక్ష్యం చేయబడిన గ్రామీణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి, మౌలిక వసతులు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల గడపదాకా తీసుకెళ్లే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.గ్రామాల అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధి అనే భావనతో పల్లె పండుగ 2.0 వంటి కార్యక్రమాలను అమలు చేస్తూ, గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, త్రాగునీటి వసతులు, పారిశుద్ధ్య పనులు విస్తృతంగా చేపడుతున్నాం.పశుపోషణను ప్రోత్సహించేందుకు గోకులం షెడ్డుల నిర్మాణం, రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన జరుగుతోంది.పేదలకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంను సమర్థవంతంగా అమలు చేస్తూ, గ్రామీణ ప్రజలకు స్థిరమైన ఆదాయ మార్గాలు కల్పిస్తున్నాం. రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ సాగునీటి వనరుల అభివృద్ధి, వ్యవసాయ రంగానికి అవసరమైన మద్దతు చర్యలు తీసుకుంటున్నాం.

మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేసి, వారికి రుణాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం.విద్య, వైద్య రంగాల్లో కూడా గణనీయమైన మార్పులు తీసుకువచ్చి, ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రుల్లో మౌలిక వసతులు మెరుగుపరుస్తున్నాం.పట్టణాలకే కాకుండా గ్రామాలను కూడా సమానంగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోంది. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ, సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకు చేరేలా పారదర్శక పరిపాలన అందిస్తున్నాం.రాబోయే రోజుల్లో రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చెందిన, సంక్షేమంతో నిండిన రాష్ట్రంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం. ప్రజల ఆశీర్వాదాలతో ఈ ప్రయాణం కొనసాగుతుందని" పెద్దలు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జి. నితిన్,జగ్గయ్యపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు & గౌరవరం సొసైటీ చైర్మన్ కట్టా వెంకట నరసింహారావు, గ్రామ సర్పంచ్ ముత్తవరపు పావని వెంకటేష్, మార్కెట్ యార్డు చైర్మన్ మల్లెల సీతమ్మ, ఏపీవో రామకృష్ణ,శేషగిరి, మహేష్, బుచ్చిబాబు, సయ్యద్ జాన్బాషా, కొప్పుల నాగేశ్వరరావు, కుక్కల జగదీష్, కొప్పుల రాము, బాజినీడి ధనమూర్తి, కోట వీర రాఘవయ్య, కొమ్మినేని వెంకటరావు, పటాన్ మహమ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్యం అందించేలా కృషి



జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

## వైద్య ఆరోగ్యశాఖ పని తీరు పై సమీక్షించిన జిల్లా కలెక్టర్

**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి జనవరి 05( వార్త సంధ్య):** జిల్లాలోని రోగులకు ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో వైద్యారోగ్య శాఖ పని తీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య కొంత తగ్గిందని, ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఏఎన్ఎం రిజిస్ట్రేషన్ నుంచి టీకాలు వేయించడం, రెగ్యులర్ చెకప్, ప్రసవం ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగే లోపం ఉండాలని కలెక్టర్ తెలిపారు. ప్రసవం తర్వాత కూడా బాలింత, శిశువు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ రెగ్యులర్ ఫాలో అప్ చేయాలని అన్నారు. ఆర్ బీఎస్ కే బృందాలు రెగ్యులర్ గా ప్రభుత్వ స్కూల్స్ ను తనిఖీ చేస్తూ పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించాలని అన్నారు. ఆర్.బి.ఎస్.కే బృందాలు సందర్శించినట్లుగా పాఠశాలల కు సర్టిఫికేట్ జారీ చేయాలని, సదరు వివరాలు ఆన్ లైన్ లో నమోదు జరిగేలా విద్యాశాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఎన్ సి.డీ సర్వే 82% జరిగిందని ఆ వివరాలు ఆన్ లైన్ లో నమోదు చేయాలని అన్నారు. మార్చి నెలాఖరు వరకు 100% ఎన్.సి.డి సర్వే పూర్తి చేయాలని, ఎన్.సి.డి సర్వేలో మధుమేహం బిపి ఉన్నవారికి ప్రభుత్వం తరఫున అవసరమైన మెడికల్ కిట్ లు రెగ్యులర్ గా అందించాలని అన్నారు. ప్రతి వారం ఎం.ఎల్.హెచ్.పి లు 50 ఎన్.సి.డి సర్వే శాంపిల్స్ ర్యాండం గా క్రాస్ చెక్ చేయాలని కలెక్టర్ సూచించారు.జిల్లాలో పాజిటివ్ గా తేలిన టిబి కేసుల వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ కిట్, అవసరమైన చికిత్స, ప్రభుత్వ సహాయం అందేలా చూడాలని అన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటనలు చేస్తూ టీబీ వ్యాధి లక్షణాలు గల వారిని గుర్తించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. రోగులకు డయాగ్నొస్టిక్ హబ్ ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించి ఫలితాలు అందించడంలో పెద్దపెల్లి జిల్లా ముందు ఉందని అన్నారు. పీ.హెచ్.సి లో మరమ్మత్తు గురైన వైద్య పరికరాలను బాగు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆరోగ్యశ్రీ పరిధిలో స్పెషలిస్ట్ వైద్య సేవలు ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలో అధికంగా జరిగేలా చూడాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల రోగులు మంచి అభిప్రాయంతో ఉండేలా మన పని తీరు ఉండాలని అన్నారు. వైద్యులు తప్పనిసరిగా సమయ పాలన పాటించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులను నిరాకరించడానికి వీలు లేదని అన్నారు. రోగులతో ప్రవర్తించే తీరు పట్ల సిబ్బంది, నర్సులను ఎప్పటికప్పుడు ట్రైన్ చేయాలని అన్నారు. జిల్లాలోని ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో నిబంధనల మేరకు పారిశుధ్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఆరోగ్యశాఖ అధికారి వాణిశ్రీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలి

-- జిల్లాస్థాయి_రీర్ ఎగ్జిబిషన్ లో గురుకుల విద్యార్థులకు ప్రథమ బహుమతి

-- రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

-- విద్యార్థులను అభినందించిన డీఈఓ నారాయణ



**తాడేపల్లిగూడెం, జనవరి 5 ( వార్త సంధ్య) :** ప్రభుత్వం అందిస్తున్న విద్యా వనరులను సద్విని చేసుకుని విద్యార్థులు నూతన ఆవిష్కరణ వైపు అడుగులు వేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి వై. నారాయణ అన్నారు ఇటీవల ఎస్ ఆర్_ ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి _రీర్ గైడెన్స్ ఎగ్జిబిషన్ ప్రదర్శనలో తాడేపల్లిగూడెం రూరల్ మండలం పెద తాడేపల్లి లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం పాఠశాలకు ప్రథమ బహుమతి లభించింది అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులు డీఈఓ నారాయణ ను ఆయన కార్యాలయంలో సోమవారం కలిసారు గురుకులం విద్యార్థులను ఆయన అభినందించారు ఈ సందర్భంగా డీఈవో వై. నారాయణ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో ప్రభుత్వం అందిస్తున్న, సాంకేతిక పరిజ్ఞానాన్ని, విద్యా వనరులను సద్వినియోగం చేసుకుని ప్రతి విద్యార్థి నూతన ఆవిష్కరణ వైపు అడుగులు వేయడంతో పాటు దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు విద్యార్థి స్థాయి నుంచి_రీర్ గైడెన్స్ అభివృద్ధికి ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు ఎంచుకున్న రంగంలో విజయం సాధించేందుకు కృషి పట్టుదలతో ముందుకు సాగాలన్నారు ఉపాధ్యాయుల సహకారంతో ఇంజనీరింగ్, విద్య వైద్య, అంతరిక్షం, సాంకేతిక, రక్షణ రంగాల్లో జరుగుతున్న పరిశోధనలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు_రీర్ ఎగ్జిబిషన్ లాంటి ప్రదర్శనల్లో విద్యార్థులు పాల్గొనడం ద్వారా వారిలో దాగి ఉన్న సృజనాత్మకత బయటపడుతుందన్నారు, సృజనాత్మకత ఆధారంగానే విద్యార్థుల_రీర్ పై స్పష్టత వస్తుందన్నారు_రీర్ ఎగ్జిబిషన్లో ప్రథమ సాధన సాధించిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం రావడం అభినందనీయం అన్నారు విజయానికి తోడ్పాటు అందించిన గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ రాజారావును ఆయన అభినందించారు ఈ కార్యక్రమంలో అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి శ్యాంసుందర్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# 108 వైద్య విధానంపై దుష్ప్రచారం తగదు



:ఎమ్మెల్యే బొలిశెట్టి.

**తాడేపల్లిగూడెం జనవరి 5 (వార్త సంధ్య ):** 108 వైద్య విధానం పై దుష్ప్రచారం తగదని తాడేపల్లిగూడెం శాసన సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఒక విషపు పత్రిక తప్పుడు కథనాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని అటువంటి అసత్య కథనాలను ప్రజలు నమ్మవద్దని బొలిశెట్టి తెలిపారు గత వైసిపి పాలనలో జగన్ ప్రభుత్వ అసమర్థత వల్ల గాడి తప్పిన వైద్య రంగాన్ని కూటమి ప్రభుత్వం సరిచేసి ప్రజలకు పూర్తి స్థాయి వైద్య సేవలు అందించే విధంగా అభివృద్ధి చేసిందని అన్నారు.వివిధ అనారోగ్యాలతో ఇబ్బంది పడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఐదు కోట్ల రూపాయల పైనే సహాయం అందించామన్నారు. అంబులెన్సులపై దుష్ప్రచారం చేయడం దారుణమని అన్నారు. అంబులెన్స్ లు పూర్తిస్థాయిలో నిర్వహిస్తున్నామని జిపిఎస్ ద్వారా పర్యవేక్షణ జరుగుతుందని ఎలాంటి ఇబ్బంది లేకుండా వైద్య సేవలు అందుతున్నాయని అన్నారు. అంబులెన్స్ చార్జీలను కూడా ప్రభుత్వం నిర్ణయించి అమలు చేస్తుందన్నారు. ఎలాంటి దోపిడీ జరగకుండా తగిన చర్యలు చేపట్టామన్నారు. ప్రజారోగ్యం విషయంలో పూర్తి చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో తుప్పు పట్టిన అంబులెన్స్ వ్యాన్ లను ఫోటోలు తీసి, అవి ఇప్పుడు ఉన్నట్టుగా సొంత మీడియాలో ప్రభుత్వం పై విష ప్రచారం చేయటం ప్రజలు గమనించాలని అన్నారు. వైసిపి హయాంలో ప్రజారోగ్యం పేరు చెప్పి దోపిడీ చేశారని విమర్శించారు. పిపిపి విధానం అనేది వాజ్ పేయి ప్రధానమంత్రిగా ఉన్న సమయంలోనే ప్రవేశపెట్టారని, జాతీయ రహదారులు నిర్మించారని గుర్తు చేశారు. ప్రభుత్వం వద్ద అవసరమైన నిధులు లేనప్పుడు పిపిపి విధానం ద్వారా అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఎలా నిర్మించినా వైద్య కళాశాలలు ప్రభుత్వ అధీనంలోనే ఉంటాయని తెలిపారు.దాని మీద కూడా విష ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేసి రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా చేసి అభివృద్ధికి ఆటంకం కలిగించడమే వైసిపి దురుద్దేశమని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల సహకారంతో తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో భారీ ఎత్తున రోడ్లు అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. గతంలో ఉపముఖ్యమంత్రిగా ఉండి రోడ్లు గుంతలు కూడా పుడ్చలేని అసమర్థుడు మేము అభివృద్ధి చేస్తుంటే తప్పుడు విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే విమర్శించారు. ఇలాంటి తప్పుడు ప్రచారం మాని సద్విమర్శలు చేయాలని కోరారు. అనంతరం ఆసుపత్రుల్లోని అత్యవసర విభాగం తదితర విభాగాలను, అంబులెన్సు లను ఎమ్మెల్యే పరిశీలించారు. ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతున్న రోగులను సేవల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు .ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ రవిపాల్, తాడేపల్లిగూడెం నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ ఈటకోట తాతాజీ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బడుగు వెంకటేశ్వరరావు, గణేష్, వర్తనపల్లి కాశి, పుల్ల బాబి,పాలూరి వెంకటేశ్వరరావు, మద్దాల మణికుమార్, రామ్ లక్ష్మణ్, పేతిన గిరి, వాడపల్లి వాడపల్లి సుబ్బరాజు,కూటమి నాయకులు, ప్రభుత్వాసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



# హంగర్ సర్వీస్ వీక్‌లో భాగంగా పోలిశెట్టిపాడులో అల్పాహార వితరణ

**తిరువూరు జనవరి 05 (వార్త సంధ్య):** లయన్స్ క్లబ్స్ వ్యవస్థాపకులు మెల్విన్ జోన్స్ పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 1వ తేదీ నుండి 13వ తేదీ వరకు నిర్వహిస్తున్న హంగర్ సర్వీస్ వీక్ (రిలీవ్ హంగర్) కార్యక్రమాల్లో భాగంగా పోలిశెట్టిపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో విద్యార్థులకు ఈరోజు అల్పాహార వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు శ్రీ పివి రావు, లెజెండ్స్ క్లబ్ అధ్యక్షులు డి. జ్వాలా నరసింహరావు పాల్గొని విద్యార్థులకు అల్పాహారం పంపిణీ చేశారు. అలాగే చలమాల శంకర్రావు, నూతక్కి రాఘవరావు, కంచర్ల ముత్య ప్రసాద్, కొమ్మినేని రాజేష్ ఖన్నా, పసుమర్తి వెంకటరమణ కుమారి, కోరుకొండ గంగాధర్ రావు, గుండారంగారావు తదితరులు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ అరిఫ్ గారు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ శోభన్ బాబు గారుతో పాటు ఉపాధ్యాయులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. విద్యార్థుల పోషకాహారానికి లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయమని పలువురు ప్రశంసించారు.

# నూతన సంవత్సరం సందర్భంగా సమైక్య ప్రెస్ క్లబ్ సభ్యుల సమావేశం



**తిరువూరు, జనవరి 05 (వార్త సంధ్య):** యన్‌టీఆర్ జిల్లా తిరువూరు బోసుబొమ్మ సెంటర్‌లోని సమైక్య ప్రెస్ క్లబ్ కార్యాలయంలో 2026 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని విలేకర్ల సమావేశం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులు మద్దిబోయిన నరేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మద్దిబోయిన నరేష్ మాట్లాడుతూ, రానున్న రోజుల్లో క్లబ్ సభ్యులందరూ సమిష్టిగా కృషి చేసి సమైక్య ప్రెస్ క్లబ్‌ను మరింత ముందుకు తీస్కువెళ్లాలని పిలుపునిచ్చారు.ప్రజలకు ప్రభుత్వానికి వారధిలా పని చేయాలనీ, ఎలాంటి సమస్యలు ఎదురైనా క్లబ్ కార్యక్రమాలు నిర్విరామంగా కొనసాగాలన్నారు.ఒకరిని ఒకరు గౌరవించుకుంటూ, ఎవరూ ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా కలిసికట్టుగా పనిచేయాలని సభ్యులు తీర్మానించారు. క్లబ్ ఉపాధ్యక్షులు సిరికొండ నాగేశ్వరరావు (అభి) మాట్లాడుతూ, క్లబ్ నియమాలను అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అక్రమ వసూళ్లకు పాల్పడే వ్యక్తుల సభ్యత్వాన్ని రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అధ్యక్షులు మద్దిబోయిన నరేష్, ఉపాధ్యక్షులు సిరికొండ నాగేశ్వరరావు (అభి), సెక్రటరీ మడిపల్లి రాంబాబు, గుగులోతు అశోక్, జరపాల ప్రకాష్, కోలా సునీల్, మల్లాది ప్రశాంత్, వేల్పుల మాధవరావు, మర్సకట్ల దిలీప్, రాయపూడి నాగముత్యం, తాటికొండ సత్యనారాయణ, షేక్ అహ్మద్, మర్సకట్ల కృష్ణవేణి, సిరికొండ వరలక్ష్మి, మారపోగు రవి తదితరులు పాల్గొన్నారు.

# డీ పీ ఆర్ టి యు నూతనసంవత్సర క్యాలెండర్, గోడపత్రిక, డైరీల ఆవిష్కరణ.....!

## ప్రధానోపాధ్యాయులు డి.జే.యం.డి ప్రసాద్ ఆధ్వర్యంలో



**తిరువూరు, జనవరి 05 (వార్త సంధ్య):** ఎన్టీఆర్ జిల్లా ఏ కొండూరు మండలం డి పి ఆర్ ఃటియు ప్రతి సంవత్సరం నూతన క్యాలెండర్, గోడ పత్రిక ,డైరీల ఆవిష్కరణలో భాగంగా ప్రధానోపాధ్యాయులు డి.జె. యం.డి ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఆవిష్కరించారు.... ఈకార్యక్రమంలో మండల అధ్యక్షులు బి.సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి రవికృష్ణకుమార్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.గిరిబాబు, జిల్లా ఉపాధ్యక్షులు బి.సురేష్ బాబు సంఘనాయకులు మోహనరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు....

# సహృదయనేత జీవన్ రెడ్డి కి జన్మదిన వేడుకలు





**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి జనవరి 5(వార్త సంధ్య):** జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంతోపాటు మండలంలోని తదితర గ్రామాల్లో జనహృదయనేత మాజీ మంత్రి జీవన్ రెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా జరిపారు.పట్టణంలోని గాంధీ చౌక్,అంగడి బజార్,భూపతిపూర్,మూట పెల్లి,ఇటిక్యాల్,లింగాపూర్,కొత్తపేట్, బోర్నపల్లి గ్రామాల్లో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. మండల కాంగ్రెస్ నాయకులు జగిత్యాల జిల్లా కేంద్రంలోని జీవన్ రెడ్డి ఇంటి వద్ద కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాయికల్ పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోపి రాజారెడ్డి,మండల ప్రధాన కార్యదర్శి గుర్రం మహేందర్ గౌడ్,పట్టణ మహిళా అధ్యక్షురాలు మమత,యూత్ మండల,పట్టణ అధ్యక్షులు ఏలేటి జలంధర్ రెడ్డి,బత్తిని నాగరాజు,నాయకులు నాయకులు కొయ్యేడి మహిపాల్,బాపురపు నర్సయ్య,ఎద్దండి దివాకర్,షాకీర్,మున్ను,కడకుంట్ల నరేష్,బత్తిని భూమయ్య, కొమ్ముల ఆది రెడ్డి,తలారి రాజేష్,మంద రమేష్,కొత్తపెల్లి గోపాల్, చింతలపల్లి గంగారెడ్డి,మాలోతు ప్రసాద్,అశోక్,రాజారెడ్డి,మోబిన్, మసూద్,షంషీర్, రాకేష్,శివ,రాజీవ్,బోదాసు జలపతి, భూమాగౌడ్, ఆనందం , సాయి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమైన క్రికెట్ పోటీలు



**జగ్గయ్యపేట జనవరి 05 వార్త సంధ్య :** జగ్గయ్యపేట,మండలంలోని షేర్ మొహమ్మద్ పేట గ్రామంలో గత 42 సంవత్సరాలుగా డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా, సిఐటియు, ఆవాజ్ మరియు ప్రజానాట్యమండలి సంయుక్త ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఃసంక్రాంతి ఆటలు యువజన మైత్రికి బాటలుః అనే నినాదంతో గ్రామస్థాయి ఆటల పోటీలలో భాగంగా సోమవారం క్రికెట్ పోటీలను ప్రజాసంఘాల నాయకులు రిబ్బన్ కట్ చేసి ప్రారంబించారు. అంతకుముందు ప్రజాసంఘాల జెండాను డివైఎఫ్ఐ నాయకులు ఎస్ రామనాథం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ గత 42 సంవత్సరాలుగా ఈ క్రీడలు నిర్వహించడం అనేది ప్రజాసంఘాలకే దక్కిందని, గ్రామంలో ప్రతి ఒక్కరి సహాయ సహకారాలు వలనే ఇది సాధ్యమైంది అన్నారు. గ్రామంలో యువత కోడి పందాలు, జూదం వంటి వాటి వైపు వెళ్ళకుండా ఈ క్రీడలు దోహదం చేస్తాయన్నారు. క్రీడాకారులు గెలుపోవటంతో సంబంధం లేకుండా క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని కోరారు. ఈ క్రికెట్ పోటీలు నేటి నుండి ఈ నెల 10వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. ఈ క్రికెట్ పోటీలకు మొత్తం 10 జట్లు పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు ఈనెల 15వ తేదీ రాత్రి బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు షేక్ గౌస్ మియా,_ శ్రీనివాసరావు, షేక్ బడే మియా, కోట రవికుమార్, ఎస్ ప్రణయ్ తేజ,_ వెంకటేశ్వరరావు, ఎస్ నాగమణి, కోటా కృష్ణ_ లింగారావు, దంతాల వెంకటేశ్వర్లు, దంతాల రాజేశ్వరి, ఎస్_ మీరా సాహెబ్_ సుబ్బారావు క్రీడాకారులు పాల్గొన్నారు.

# మన దేశాన్ని డ్రగ్స్ రహిత దేశముగా మార్చాలి : జడ్జి షేక్.రియాజ్





**వార్త సంధ్య నందిగామ జనవరి 06//** నేటి యువతరం, విద్యార్థులు డ్రగ్స్ కు, చెడు అలవాట్లకు బానిసలు కాకుండా మీరు ఉజ్వలమైన భవిష్యత్తుకు పునాది కావాలని మీ తల్లిదండ్రుల యొక్క ఆసియాలను సాధించినప్పుడే మీ జీవితం సుఖమంతమై ఉన్నతమైన హోదాలో ఉంటారని నందిగామ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్.రియాజ్ పేర్కొన్నారు. నందిగామ రైతు పేటలో గల పద్మావతి ఐటిఐ కళాశాల నందు మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలోccమన దేశాన్ని డ్రగ్స్ రహిత దేశముగా మార్చాలి cccఅని నేషనల్ లీగల్ సర్వీస్ అథరిటీ పిలుపుమేరకు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించిన జడ్జిగారు దేశ భవిష్యత్తుకు ముఖ్యమైన కీలక పాత్ర పోషించేది యువతరమైననని వారు ఎప్పుడూ కూడా వారి ఆశయాల కోసం మంచి నడవడికతో సమాజానికి ఉపయోగపడే విధముగా ప్రవర్తించాలని, చెడు ప్రవర్తనకు, డ్రగ్స్ కు బానిస అయితే వారి జీవితాలు చాలా అంధకారం గానూ, కేసుల్లో ఇబ్బందులు ఎదుర్కొనవలసి వస్తుందని కోరినారు. నందిగామ బార్ అసోసియేషన్ అధ్యక్షులు నండ్రు బాబు విద్య సాగర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బార్ ప్రధాన కార్యదర్శి అద్దంకి మణిబాబు, కొమ్మినేని మౌలేశ్వరరావు, ఎక్కిరాల హనుమంతరావు, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, షేక్ సైదా, కర్ల నాగభూషణం, షేక్ దాదా సాహెబ్, పద్మావతి కళాశాల ప్రిన్సిపాల్ సంగమేశ్వర రావు, మీూజ స్టాఫ్ గంగ జ్యోతి విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల సంక్షమ బోర్డు ఏర్పాటు చేయాలి



**దుబ్బాక జనవరి 05(వార్త సంధ్య):** సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం లో తెలంగాణా ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సూర్యాపేట లో జనవరి 10 న జరిగే ఉద్యమకారుల మహాసభ గోడ పత్రికను,తెలంగాణ ఉద్యమ రాష్ట్ర కమిటీ నాయకురాలు ఇంద్రక్క సమక్షంలో తెలంగాణా ఉద్యమకారుడు కాసారం కృష్ణ గౌడ్, తెలంగాణ ఉద్యమ కళకారులు ధనలక్ష్మి పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్బంగా రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఇంద్రక్క మాట్లాడుతూ ఈ కార్యక్రమం కు తన సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నానని, ఉద్యమకారులు అందరు పాల్గొని ఈ మహాసభను విజయవంతం చెయ్యాలని పిలుపునిచ్చారు.

# డైమండ్స్ లయన్స్ ఆధ్వర్యంలో భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు



**తాడేపల్లిగూడెం, జనవరి 05 (వార్త సంధ్య):** తాడేపల్లిగూడెం భవిత దివ్యాంగుల శిక్షణ కేంద్రంలో తాడేపల్లిగూడెం డైమండ్ లయన్స్ క్లబ్ జిల్లా చైర్ పర్సన్ లయన్ పేరిచర్ల మురళి కృష్ణంరాజు సౌజన్యంతో అంధుల జీవితాలలో ఆరు చుక్కల సహాయంతో చదవగలే శక్తిని ప్రసాదించిన మహోన్నత వ్యక్తి లూయిస్ బ్ర యి లీ అని పేరిచర్ల ఫౌండేషన్ చైర్మన్ లయన్ పేరిచర్ల మురళి కృష్ణంరాజు తెలిపారు. లూయిస్ బ్రెయిలీ జయంతిని పురస్కరించుకొని భవిత కేంద్రం లో విద్యార్థులకు ఆటలు పోటీలు నిర్వహించి సర్టిఫిట్స్ బహుమతులు, మిఠాయిలు అందజేయడం జరిగింది, విద్యార్థులకు దాతలు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయుని ఎం చంద్రకుమారి, తాడేపల్లిగూడెం డైమండ్ లయన్స్ క్లబ్ సభ్యులు సాయి సత్యనారాయణ రాజు, యర్రా ఆంజనేయస్వామి, కుందుం వెంకటేశ్వరరావు దివ్యాంగుల పిల్లలు తల్లిదండ్రులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# జాతీయ రహదారి భద్రత మాస ఉత్సవాలు

ఆటో కార్ లారీ ట్రాక్టర్ వ్యన్ ద్విచక్ర వాహనాదారులకు అవగాహన.



**తాడేపల్లిగూడెం, జనవరి 05 (వార్త సంధ్య) :** తాడేపల్లిగూడెం రవాణా కార్యాలయంలో పరిధి లో ఉన్న వాహనాలు నడిపే వారికి ప్రతి ఒక్కరికీ రవాణా భద్రత నియమాలను పాటించాలి. మోటార్ వేవికల్ ఇన్స్పెక్టర్, యూనిట్ కార్యలయం లో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో సిబ్బంది తో కలిసి ఆటో కార్ లారీ ట్రాక్టర్ వ్యన్ ద్విచక్ర వాహనాదారులకు అవగాహనా కల్పించారు. తగిన సూచనాలు తెలియజేసారు. పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ ,రవాణా శాఖ అధికారి వారి ఆదేశాలతో 37వ జాతీయ రహదారి భద్రత మాస. ఉత్సవాలు 1.01.2026 నుండి 31.01.2026 జరుగుతాయని అని అన్నారు. ఈ సందర్భంగా వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదు అని డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడపరాదు అని తెలిపారు. లైట్ మోటార్ వైవికల్ నడుపు వాహనదారులు సీట్ బెల్ట్ లేకుండా డ్రైవింగ్ చేయడం, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ ప్రమాదలు కొని తెచ్చుకోవద్దని తెలియజేసారు. నిబంధనలు పాటించని వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు చిన్న పిల్లలు 18 సంవత్సరాల వయస్సు దాటినా పిల్లలకు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు ఇవ్వరాదని తల్లిదండ్రులకు మోటార్ వైవికల్ ఇన్స్పెక్టర్ నాయక్ సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

# దుబ్బాక మండలం పరిధిలోని CSR క్యాంప్ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా లబ్ధి దారులకు ఆర్థిక సహాయం అందజేత



**దుబ్బాక జనవరి 05(వార్త సంధ్య):** సిద్దిపేట జిల్లా దుబ్బాక మండల లోని సిఎస్ఆర్ క్యాంపు కార్యాలయం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ విలువైన చెక్కులను దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డిలబ్ధిదారులకు అందజేశారు. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, “ప్రజలు ఎలాంటి కష్టాల్లో ఉన్నా కూటమి ప్రభుత్వం వారికి అండగా నిలుస్తుంది. అర్హులైన ప్రతి కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం అందేలా నిరంతరం చర్యలు తీసుకుంటున్నాం” అని తెలిపారు. “తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపశమనాన్ని ఇస్తోంది. అవసరంలో ఉన్నవారికి ప్రభుత్వ సహాయం చేరేలా నిరంతరం ప్రయత్నిస్తాం” అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు..

# ముగ్గుల పోటీ కార్యక్రమంలో పాల్గొన్నా బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి



**ఎల్బీనగర్ ప్రతినిధి,వార్త సంధ్య, జనవరి 05:** బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని వీరాంజనేయ కాలనీలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నిర్వహించిన ముగ్గుల పోటీ కార్యక్రమంలో బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ముగ్గుల పోటీలు కాలనీలో నిర్వహించడం సంతోషకరంగా ఉందని అన్నారు మరియు ఈ ముగ్గుల పోటీలలో విజేతలకు కార్పొరేటర్ సొంత ఖర్చులతో బహుమతులను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు సత్యనారాయణ, ఉపాధ్యక్షులు రామయ్య, జాయింట్ సెక్రటరీ రెహమాన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఖాదర్ బాషా, ట్రెజరర్ శివ శంకరయ్య, కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ రెడ్డి, రమేష్, అనిల్ కుమార్, సాయి శ్రీ వాత్సవ్, ఫణీంద్ర మరియు నిర్వహణ జడ్జిలు శకుంతల, ప్రవీణ, విజయలక్ష్మి, విజేతలు వెంకట రాధా, మహేశ్వరి, పూజ మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఇటిక్యాల పద్మశాలి యువనేత సంఘ నూతన కార్యవర్గం.



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి జనవరి 5(వార్త సంధ్య):** జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామ పద్మశాలి యువనేత సంఘ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నూతన అధ్యక్షులుగా భోగా రాజశేఖర్, ఉపాధ్యక్షులుగా సామల మహేష్, కోశాధికారిగా ఆడెపు రాజు, సలహాదారులుగా సామల రాజకుమార్ ఆడెపు రాముల కార్తీక్ ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు రాజు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి సంఘం అభివృద్ధికి పాటుపడతానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు రాజకుమార్ ,కార్తీక్, రాజేష్, సాయికుమార్, యువనేత సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పినపాక అభివృద్ధిని చూసి అసూయతో విమర్శలు ఉ పోతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి



**పినపాక, జనవరి 05 (వార్త సంధ్య):** పినపాక నియోజకవర్గంలో జరుగుతున్న సమగ్ర అభివృద్ధిని చూసి అసూయతో మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు కాంగ్రెస్ పార్టీపై మరియు స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పై తప్పుడు విమర్శలు చేస్తున్నారని బూర్గంపాడు పీఏసీఎస్ మాజీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి మండిపడ్డారు.సోమవారం బూర్గంపాడు మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పినపాక నియోజకవర్గంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నాయకత్వంలోనే అభివృద్ధి సాధ్యమైందని జగమెరిగిన సత్యం అన్నారు. అలాగే భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ సాధించడంలో పాయం వెంకటేశ్వర్లు కృషి అని నియోజకవర్గ ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరని స్పష్టం చేశారు. కిన్నెరసాని ప్రాజెక్టు కాలువల ద్వారా రైతుల పొలాలకు సాగునీరు అందించడం, ప్రతి పేదవాడికి సన్నబియ్యం, మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, అర్హులైన కుటుంబాలకు రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి ప్రజా సంక్షమ పథకాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల మనసు గెలుచుకుందని అన్నారు. ఈ ప్రజాహిత కార్యక్రమాల ఫలితంగానే ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక సర్పంచ్ స్థానాలు సాధించిందని, ఆ విజయాన్ని ఓర్వలేకనే మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేసిన అనుభవం ఉన్న వ్యక్తి ఇలాంటి చమకబారు వ్యాఖ్యలు చేయడం బాధాకరమని, దానిని ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో బూర్గంపాడు సర్పంచ్ మందా నాగరాజు, సారపాక సర్పంచ్ కిషోర్ శివరాం నాయక్, బూర్గంపాడు ఉపసర్పంచ్ గుండె వెంకన్న, జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ భజన సతీష్, బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలు బర్ల నాగమణి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు కన్నేపల్లి శివ, నాయకులు భజన ప్రసాద్, దగ్గుపల్లి ప్రభాకర్, తిరుమల రాంబాబు, దేగల వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

# వార్డ్ఉబాట కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్

ఇల్లందు మున్సిపాలిటీ అభివృద్ధి మాదే





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఇల్లందు ప్రతినిధి , జనవరి 05 (వార్త సంధ్య):** ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని 8, 13, 15 వార్డుల్లో నిర్వహించిన వార్డ్ఉబాట కార్యక్రమంలో ఇల్లందు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంచార్జ్ బానోత్ హరిప్రియ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక సభ్యులు దిండిగాల రాజేందర్ పాల్గొన్నారు. బస్తీలలోని ప్రజలు, పెద్దలతో కలిసి తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇల్లందు మున్సిపాలిటీలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఆమె వివరించారు. ఈ సందర్భంగా బానోత్ హరిప్రియ నాయక్ మాట్లాడుతూ, ఒకప్పుడు వెనుకబడి ఉన్న ఇల్లందు మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు. జి.ఓ.76 ద్వారా ప్రజలు కట్టుకున్న ఇళ్లకు రిజిస్ట్రేషన్ చేసి పట్టాలు అందించామని గుర్తు చేశారు. దుర్వాసన వెదజల్లుతున్న బుగ్గ వాగును అభివృద్ధి చేసి ముంపు సమస్య నుంచి ప్రజలను కాపాడామని తెలిపారు. ఇల్లందులో సాధ్యం కాదనుకున్న బస్ డిపోను సాధించామని, వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి, డయాలసిస్ కేంద్రం, గర్భిణీ స్త్రీలకు టిఫా స్కానింగ్, సిజేరియన్ ఆపరేషన్ల సదుపాయాలను ఇల్లందు ప్రభుత్వ వైద్యశాలలోనే కల్పించామని చెప్పారు. ఈ అభివృద్ధి అన్నీ ముఖ్యమంత్రి కేసీఆర్, అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు సహకారంతో సాధ్యమయ్యాయని వివరించారు. కరోనా కష్టకాలంలోనూ ప్రజలకు అండగా నిలిచింది గులాబీ పార్టీనేనని, ప్రతి ఇంటికి సంక్షమం, ప్రతి వీధికి అభివృద్ధి అందించిన ప్రభుత్వం బీఆర్ఎస్ అని స్పష్టం చేశారు. మార్పు పేరుతో కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇచ్చిన ప్రజలు నేడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. ఉచిత విద్యుత్ పేరుతో విద్యుత్ కోతలు, అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నారని, ఆర్టీసీ ఉచిత ప్రయాణం పేరుతో ఇతర చార్జీలు పెంచారని ఆరోపించారు. గత రెండున్నర సంవత్సరాలలో ఇల్లందు మున్సిపాలిటీలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క కొత్త అభివృద్ధి కార్యక్రమాన్నైనా చేపట్టిందా అని ప్రశ్నించారు. తాము ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మంజూరు చేసిన నిధులతోనే నేడు శిలాఫలకాలు వేస్తూ ప్రారంభోత్సవాలు చేస్తున్నారని అన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ఆశీర్వదించి గులాబీ జెండా ఎగరవేయాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు సిలివేరి సత్యనారాయణ, ఇల్లందు పట్టణ అధ్యక్షులు మహమ్మద్ అబ్దుల్ జబార్,ఇల్లందు ప్రధాన కార్యదర్శి పరిచూరి వెంకటేశ్వర్లు ,ఇల్లందు పట్టణ మాజీ వార్డ్ కౌన్సిలర్లు, కడకంచి పద్మ, చీమల సుజాత, 8వార్డు బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాలడుగు రాజశేఖర్, 13 వార్డు బీ ఆర్ఎస్ పార్టీ నాయకులు కడకంచి వీరస్వామి,15 వార్డు బీఆర్ఎస్ పార్టీ నాయకులు కావేటి రమేష్, ఎస్కె ఇమ్రాన్,యువజన నాయకులు నాయకులు గిన్నారపు రాజేష్, చాంద్ పాషా మీర్జా బేగ్,నెమలి నిఖిల్, కొండు రవికాంత్, బజారు సత్యనారాయణ, ఇల్లందు పట్టణ మహిళ ఉపాధ్యక్షురాలు కొడగండ్ల నారాయణమ్మ, రెహనా, సల్మా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు...

# ప్రభుత్వ ఉత్సవ కమిటీ.. ప్రైవేటు ఉత్సవ కమిటీల మధ్య వార్..!!

సమస్యాత్మకంగా మారనున్న వేడుక..!

దేవాదాయ, పోలీస్ అధికారుల మేలుకొలుపు..



ప్రభుత్వ ఉత్సవ కమిటీ



పోటీగా ప్రైవేటు ఉత్సవ కమిటీ

**కృష్ణాజిల్లా బ్యూరో జనవరి 05 వార్త సంధ్య:** జిల్లా పరిధిలోని,శ్రీ తిరుపతమ్మ అమ్మవారి రంగుల మహోత్సవం మరియు పెద్ద తిరునాళ్ల నిర్వహణకు జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్సవ కమిటీని నియమించింది. ఈ కమిటీలు సభ్యులుగా చుంచు రమేష్, శ్రీమతి కాకులపాటి విజయలక్ష్మి. కల్లూరీ శ్రీవాణి- బీజేపీ తన్నీరు గోపినాథ్- జనసేన, సెనగవరపు వెంకటేశ్వరావు కొలిపాక హైమ,పి అనసూయ. ఫిజె ప్రియాంక. జి రమేష్. జి పెద్ద ఆంజనేయులు. ఓర్సు సూరమ్మ, సరిపినేని అప్పారావు-మక్కపేట కర్ణాటి కవిత- అనిగండ్లపాడు లు నియామకం చేయగా చైర్మన్గా చుంచు రమేష్ వ్యవహరిస్తున్నారు. అమ్మవారి తో పాటు సహా విగ్రహాలు ఊరేగింపు జగ్గయ్యపేటకు బయలుదేరడం జరిగింది. ఈ ఊరేగింపులో ఉత్సవ కమిటీ సభ్యులు దేవాదాయ అధికారులతో కలిసి పర్యవేక్షణ చేస్తున్నారు. అయితే జగ్గయ్యపేటలో ఉత్సవ కమిటీ పేరుతో ఆకుల శ్రీకాంత్. ఆర్కె. సతీష్. కిషోర్ల నాయకత్వంలో రాజకీయ పార్టీల నాయకులు ప్రజాప్రతినిధులను కలిసి అమ్మవారి రంగుల మహోత్సవంలో పాల్గొనాలని ఆహ్వానం పలుకుతున్నారు. ఈ విషయం తెలిసి ప్రభుత్వం నియమించిన ఉత్సవ కమిటీ సభ్యులలో కొందరు ఇప్పటికే ఈ విషయాన్ని శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలుస్తుంది. ఏది ఏమైనా అమ్మవారి రంగుల మహోత్సవానికి ప్రభుత్వం నియమించిన ఉత్సవ కమిటీ పర్యవేక్షణలో వేడుకలను నిర్వహించాలని పలువురు సభ్యులు కోరుతున్నారు. అయితే ప్రైవేటుగా ఉన్న ఉత్సవ కమిటీ సభ్యులు మాత్రం తామే చేస్తామని, జగ్గయ్యపేటలో అమ్మవారి రంగుల వేదిక వద్ద ప్రభుత్వ ఉత్సవ కమిటీ సభ్యులకు సంబంధం లేదని పేర్కొంటూ పలువురిని ఆహ్వానించడం జరుగుతుంది. ఉత్సవ కమిటీల మధ్య ఏర్పడిన అధికార వివాదం సమస్యాత్మకంగా మారనుందని. ఇప్పటికే చింత శ్రీనివాసరావు సంబంధించిన అధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. దీనిపై దేవాదాయ మరియు పోలీస్ శాఖ అధికారులు నిబంధనల ప్రకారం ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలు




**జగ్గయ్యపేట జనవరి05 (వార్తసంధ్య ప్రతినిధి):** జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా జగ్గయ్యపేట రవాణా శాఖ అధికారి యంవియన్ నారాయణ రాజు,జగ్గయ్యపేట మండలం ముక్త్యాల గ్రామంలో ఉన్న సిపి సిమెంట్ కర్మాగారంలో సోమవారం భారీ వాహనదారులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జగ్గయ్యపేట రవాణా శాఖ అధికారి యంవిఐ యంవియన్ నారాయణ రాజు వాహనదారులతో మాట్లాడుతూ వాహనాలను రాంగ్ రూట్ లో ఓవర్ లోడ్ తో ప్రయాణం చేయకూడదని,భారీ వాహనాల కాగితాలు అన్ని ఫోర్స్ లో ఉండేలా చూసుకోవాలని,డ్రైవర్ కి లైసెన్స్ డ్రైవింగ్ ఉండాలని,తప్పని సరిగా కాకి చొక్కాను ధరించాలని తెలియజేసారు.వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరు సిగ్నల్స్ ని, రోడ్డు భద్రతను పాటించాలని ఆయన వాహనదారులకు తెలియజేశారు.అనంతరం డ్రైవర్లకు ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు.సిపి సిమెంట్ డిజియం పి రామి రెడ్డి, సీనియర్ మేనేజర్లు యన్ కృష్ణా రెడ్డి,టి సోమేశ్వర రావు, డాక్టర్ పి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# గౌరవరంలో పల్లె పండుగ




**జగ్గయ్యపేట జనవరి05 (వార్తసంధ్య ప్రతినిధి) న:** గ్రామీణాభివృద్ధికి అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా జగ్గయ్యపేట మండలం గౌరవరం గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురామ్ శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామంలో రూ.16 లక్షల వ్యయంతో నిర్మించిన గోకులం షెడ్డులను, రూ.30 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు.రూ15 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా రఘురామ్,తాతయ్య మాట్లాడుతూ గౌరవరం గ్రామంలో మొత్తంగా రూ 61 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులు గ్రామ మౌలిక వసతులను మరింత బలోపేతం చేయనున్నాయని, గ్రామ ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నితిన్, గౌరవరం సొసైటీ చైర్మన్ కట్టా వెంకట నరసింహారావు,గ్రామ సర్పంచ్ ముత్తవరపు పావని వెంకటేష్,మార్కెట్ యార్డు చైర్మన్ మల్లెల సీతమ్మ, ఏపీవో రామకృష్ణ,శేషగిరి, మహేష్,బుచ్చిబాబు,సయ్యద్ జాన్బాషా, కొప్పుల నాగేశ్వరరావు, కుక్కల జగదీష్, కొప్పుల రాము, బాజినీడి ధనమూర్తి, కోట వీర రాఘవయ్య, కొమ్మినేని వెంకటరావు,పటాన్ మహమ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# పాత వార్డు ప్రకారం కాకుండా కొత్తగా వార్డుల విభజన చేపట్టాలి



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి జనవరి 5(వార్త సంధ్య):** పాత వార్డుల్లో హౌస్ నెంబర్ ప్రకారంగా వార్డు ఓటర్ జాబితాలో ఒక వార్డు నుండి మరోవార్డులోకి ఓటర్లు వెళ్లారని రహదారి, కాలనీలను పరిగణలోకి తీసుకొని కొత్తగా వార్డుల విభజన చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ మనోహర్ కు ఇద పార్టీల ప్రతినిధులు సోమవారం వినతి పత్రాన్ని అందించారు.ఇంటి నెంబర్ ను పరిగణంలోకి కాకుండా ఒక కాలనీని యూనిట్ గా చేసుకొని వార్డులను విభజిస్తే పాలనపరంగా అభివృద్ధి పరంగా సులువుగా ఉంటుందన్నారు. ఇంటి నెంబరు ఒకచోట ఉండి మరో వార్డులో ఓటర్లుగా నమోదయ్యాలని ఇంటి నెంబర్లతో కాకుండా జగిత్యాల్ మున్సిపాలిటీ కాలనీలను యూనిట్ గా చేసుకుని తయారుచేసిన ఓటర్ విభజన మాదిరిగా రాయికల్ మున్సిపాలిటీని 12 వార్డులకు సరిపడా ఓటరు ముసాయిదా జాబితాను తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు మ్యాకల రమేష్,కల్లెడ ధర్మపురి, కొయ్యేడి మహిపాల్, బత్తిని నాగరాజు,మోర రామ్మూర్తి,మున్ను,షాకీర్, మున్ను, పొన్నం శ్రీకాంత్,కడుకుంట్ల నరేష్,రాజీవ్, రాజారెడ్డి,శివ,సాయి, తదితరులు పాల్గొన్నారు.

# తెలుగుదేశం పార్టీ కోశాధికారి గాదె వెంకటేశ్వరరావు GVR చేత కొలికపోగు భాస్కరరావు కుటుంబానికి పరామర్శ




**తిరువూరు, జనవరి 05 (వార్త సంధ్య):** ఎన్టీఆర్ జిల్లా విసన్నపేట మండలం పుట్రెల గ్రామ పంచాయతీ నార్త్ ఎస్సీ కాలనీలో తెలుగుదేశం పార్టీ కార్యకర్త కొలికపోగు అశోక్ తండ్రి కొలికపోగు భాస్కరరావు ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో విసన్నపేట మండల తెలుగుదేశం పార్టీ కోశాధికారి గాదె వెంకటేశ్వరరావు (+ఎ=) మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన ఆయన, తెలుగుదేశం పార్టీ మీకు ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అంతేకాకుండా కుటుంబానికి కొంత ఆర్థిక సహాయం, బియ్యం టిక్కీ అందజేశారు. ఈ కార్యక్రమంలో కోఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ కొండా భాస్కరరావు, కొలికపోగు శీను, దుబ్బాక యోహోను, కొలికపోగు రవి, బూత్ కన్వీనర్లు రణధీరు, నాగేష్, బాలమర్తి యేసు, కొలికపోగు ఉదయ్ కుమార్, కొలికపోగు రత్న కిషోర్, కొలికపోగు వెంకటేష్,రాజు గార్లపాటి బంధువులు, మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త నిర్ణయాలు .. కొనసాగిద్దాం ఇలా




నూతన సంవత్సరంలో అడుగు పెట్టేశారు.. హ్యాపీ హ్యాపీ న్యూ ఇయర్ అంటూ సందడి చేసే ఉంటారు.. బంధువులకు, స్నేహితులకు అందరికీ న్యూ ఇయర్ విషెస్ చెప్పే ఉంటారు..పనిలో పనిగా అది చేద్దాం, ఇది చేద్దాంఅని బోలెడు నిర్ణయాలు తీసుకొనే ఉంటారు. ఎప్పుడైనా ఆలోచించారా?..ఏటా జనవరిలో తీసుకునే నిర్ణయాలు ఎంతవరకు కొనసాగిస్తున్నామో అని. పోయిన ఏడాది తీసుకున్న నిర్ణయాలు ఎంతవరకు అమలు చేశారో.. ఓసారి గుర్తుతెచ్చుకోండి. చాలావరకు మధ్యలోనే వదిలేసి ఉంటారు కదా. మీరే కాదు.. ప్రపంచంలో 92 శాతం మంది ఇదే బాపతు. 2025 జనవరిలో 18 నుంచి 29 ఏళ్ల మధ్య వారు 49 శాతం, 30 నుంచి 49 ఏళ్ల మధ్య వారు 31 శాతం, 50 ఏళ్లు పైబడిన వారు 21 శాతం కొత్త నిర్ణయాలు తీసుకున్నారట. అందులో 43 శాతం మంది ఫిబ్రవరి నెలలో, 46 శాతం మంది ఆరు నెలల్లో తీసుకున్న నిర్ణయాలను గాలికి వదిలేశారట. కేవలం 8 శాతం మంది మాత్రమే ఏడాది చివరి వరకు వారు తీసుకున్న నిర్ణయాలను కొనసాగించారట. సో.. న్యూ ఇయర్‌లోకి అడుగు పెట్టగానే నిర్ణయాలు తీసుకోవడం, వాటిని మధ్యలోనే వదిలేయటం ఓ రివాజు అన్నమాట.

## ఎందుకు అలా?

నూతన సంవత్సరం మొదట్లో ఎంతో ఉత్సాహంతో, నిబద్ధతతో తీసుకున్న నిర్ణయాలను మధ్యలోనే ఎందుకు వదిలేస్తున్నామని ఎప్పుడైనా ఆలోచించారా?.. సైకాలజిస్టులు జానెట్ పాలవి, పీటర్ హెరమన్‌లు ఈ విషయంపై ఆలోచించారు. నిర్ణయాలను ఇలా మధ్యలోనే వదిలేయడానికి నాలుగు కారణాలు ఉన్నాయని వారి అధ్యయనంలో తెలిసింది.

ఎవరైనా సరే తమ అలవాట్లు వ్యవస్థలో పెనుమార్పులు తీసుకురాగలవని నమ్ముతారు, ఆ మార్పులు కంటికి కనిపించక వాటిని వదిలేస్తారు.

వారు కోరుకున్న మార్పు రావడానికి ఎంతో సమయం పట్టదు అని, చాలా కొద్ది రోజుల్లోనే తాము అనుకున్న సాధిస్తామని భ్రమ పడతారు.

తమ అలవాట్లు, ప్రవర్తనను మార్చుకోవడానికి కావలసిన శక్తి వారికి లేకపోయినా, ఆ విల్‌పవర్ తమకు ఉందని అపోహ పడతారు.

కొత్త అలవాట్లతో, ప్రవర్తనలో మార్పులతో జీవితంలో అద్భుతాలు జరుగుతాయని ఆశ పడతారు. అలా జరగకపోవడంతో నిరాశ పడతారు.

ఈ నాలుగు రకాల అవాస్తవ ఆలోచనలు, అంచనాల కారణంగానే కొత్త ఏడాది సందర్భంగా తీసుకునే నిర్ణయాలను మధ్యలోనే వదిలేస్తారు.

## కొనసాగించడం ఎలా?

ఇదంతా తెలుసుకొని అసలు అమలు చేయలేనప్పుడు నిర్ణయాలు తీసుకోవడం ఎందుకు అని వెనకడుగు వేయాల్సిన అవసరం లేదు. కొద్దిపాటి జాగ్రత్తలు, చిన్నచిన్న మార్పులతో నూతన సంవత్సర నిర్ణయాలను కొనసాగించవచ్చని మానసిక నిపుణులు చెప్తున్నారు.

## ఓ మంత్రం అనుకోండి..

నూతన సంవత్సరంలో అది చేద్దాం.. ఇది చేద్దాం, ఇది మార్చేద్దాం.. అది మార్చేద్దాం అనుకోకుండా మీరు ఆచరించాల్సిన ఒక పదాన్ని తీసుకోండి, దాన్నే మంత్రంగా భావించండి. ఈ ఏడాదిలో కోపాన్ని తగ్గించుకుందాం.. రోజు వ్యాయామం చేద్దాం.. అందరితో స్నేహంగా ఉందాం.. ఇలా అన్నమాట. వందలు వద్దు.. ఒక్కటి మాత్రమే తీసుకోండి. దానికి ఎటువంటి టార్గెట్స్ పెట్టుకోవద్దు. ఏదైతే మంత్రంగా భావించారో దాన్ని ఏడాదంతా కొనసాగించడానికి ప్రయత్నించండి. మంత్రాలకు చింతకాయలు రాలుతాయా.. అనుకోవాల్సిన అవసరం లేదు, సత్ఫలితాలను మీరే చూస్తారు.

## ఏం వద్దనుకుంటున్నారో లిస్ట్ రాయండి..

సాధారణంగా కొత్త సంవత్సరంలో అడుగు పెట్టగానే అందరూ చేసే పని ఏంటంటే.. అది చేసేద్దాం ఇది చేసేద్దాం అని అనుకోవడం. అలా కాకుండా ఏం చేయకూడదని భావిస్తున్నారో నిర్ణయించుకోండి. డబ్బులు దుబారా చేయకూడదు.. ఆఫీస్‌కి లేటుగా వెళ్లకూడదు.. స్నేహితులు, బంధువులతో గొడవలు పెట్టుకోకూడదు.. ఇలా అన్నమాట. ఏం చేద్దాం అనే దానికంటే ఏం చేయకూడదు అనేది బాగా పనిచేస్తుందని నిపుణుల మాట.

## నెలకో లక్ష్యం రాసుకోండి..

ఇలా చేయాలి.. అలా చేయాలి అనుకోవడం కంటే ఏ నెలలో ఏం చేయాలో రాసి పెట్టుకుంటే అనుకున్నది సాధించవచ్చు. జనవరి నెల అంతా తక్కువగా మాట్లాడాలి.. ఫిబ్రవరి అంతా ధ్యానం చేయాలి.. మార్చి నెల అంతా ఎమోషన్స్ కంట్రోల్లో ఉంచుకోవాలి.. ఇలా 12 నెలలకు 12 లక్ష్యాలు నిర్దేశించుకోండి. నెలలో 30 రోజులు దాన్ని పాటించడానికి ప్రయత్నించండి.

## చిన్ని చిన్ని ఆశ..

చాలాసార్లు చేసే పొరపాటు ఏంటంటే పెద్ద పెద్ద లక్ష్యాలను పెట్టుకోవడం, వాటిని సాధించలేక చతికిలబడటం. అందుకే మీరు సాధించాలనుకున్న లక్ష్యానికి చేరుకోవడానికి దోహదపడే చిన్న చిన్న లక్ష్యాలను ఎంచుకోండి. ఒక్కో చిన్న లక్ష్యాన్ని సాధించడానికి ప్రణాళిక రూపొందించండి. చిన్న లక్ష్యాలను సాధించినప్పుడు మీలో డోపమైన్ రిలీజ్ అయి ముందున్న లక్ష్యాలను సాధించడానికి మిమ్మల్ని ప్రోత్సహిస్తుంది. ఇదండీ కొత్త సంవత్సరం నిర్ణయాలను కొనసాగించే విధానం. ఇవన్నీ ఏదో గాలి మాటలు కాదు, పరిశోధనలను ఆధారంగా చేసుకొని రూపొందించిన పద్ధతులు. వీటిని అవగాహన చేసుకోండి.. నూతన సంవత్సరంలో మీ లక్ష్యాలను సాధించండి.. విష్ యు ఆల్ ద బెస్ట్.

# ఇదే మంచి కాలం.. భారతావనిని చుట్టేసొద్దాం!



విభిన్నమైన భౌగోళిక ప్రాంతాలు, వాతావరణ మండలాలు, సంస్కృతులు, ఆహార విధానాలతో భారతదేశం వైవిధ్యభరితంగా ఉంటుంది. అసలు మన భూగ్రహానికి మన దేశం ఓ నఖలుగా సగర్వంగా చెప్పుకోవచ్చు. ఈ నేపథ్యంలో 2025 ఏడాదిలో కొత్తగా మన భారతావనిని సందర్శించండి. మనదేశంలో జూన్ నుంచి సెప్టెంబర్ వరకు వర్షాలు కురుస్తాయి. మార్చి చివరి నుంచి మే వరకు ఎండలు మండుతుంటాయి. కాబట్టి అక్టోబర్ నుంచి మార్చి మధ్య కాలం భారతదేశంలో ఏ ప్రాంతాన్ని సందర్శించడానికైనా అత్యుత్తమమైన సమయం. హిమాలయాల్లో వేసవి విడుదలను సందర్శించడానికి ఏప్రిల్ నుంచి జూన్ నెల తొలివారం వరకు మంచి సమయం.

### బొంబాయి-గోవా

ఈ రెండు ప్రాంతాలను ప్లాన్ చేసుకుంటే పండర్‌పుర్, తుల్జాపుర్, షిర్డీ, నాసిక్ లాంటి పుణ్యక్షేత్రాలతోపాటు మహారాష్ట్రుల కోటలు, అరేబియా సముద్రం అందాలు, గోవాలో పోర్చుగీసుల సాంస్కృతిక ఆనవాళ్లు, బొంబాయిలో బ్రిటిష్ కాలపు నిర్మాణాలను చూడొచ్చు.

### ఢిల్లీ-రాజస్థాన్

ఢిల్లీ, రాజస్థాన్ రాష్ట్రాలను కలిపి ప్లాన్ చేసుకుంటే మంచిది. ఒకేసారి దేశ రాజధానితోపాటు, రాజస్థాన్‌లోని కోటలు, ఆగ్రాలోని తాజ్‌మహల్, మథుర, బృందావనంలో కృష్ణ పరమాత్ముడి మధురస్మృతులను నింపుకొని రావచ్చు.

### గుజరాత్‌జి

సోమనాథ్ జ్యోతిర్లింగం, ద్వారక శ్రీకృష్ణ మందిరం, మహాత్మాగాంధీ పుట్టిన పోర్‌బందర్‌తోపాటు రాజధాని గాంధీనగర్, అహ్మద్‌నగర్, కచ్ ఉప్పు నేలలు, గిర్ సింహాల అడవి దర్శనీయ ప్రదేశాలు.

### కర్ణాటక-కేరళ

బెంగళూరు, మైసూరు నగరాలు, కావేరీ నదితోపాటు కేరళలో పశ్చిమ కనుమల అందాలు, అరేబియా సముద్ర బీచ్‌లు, అనంతపద్మనాభ స్వామి దేవాలయం తదితరాలు, సముద్రపు కాల్వల్లో పడవ ప్రయాణాలు జీవితకాలపు జ్ఞాపకాలుగా మిగిలిపోతాయి.

### తమిళనాడుజి

మిగిలిన దేశానికి భిన్నంగా తమిళనాడులో అక్టోబర్ డిసెంబర్ మధ్యలో వర్షాలు, తుపానులు వస్తాయి. మిగిలిన సమయంలో ఎప్పుడైనా ఈ రాష్ట్రాన్ని చుట్టేసిరావచ్చు. మహాబలిపురం, కంచి, తంజావూరు, మదురై, కన్యాకుమారి, ఊటీ ఇక్కడి ప్రసిద్ధ స్థలాలు.

### ఉత్తరప్రదేశ్-బిహార్

అయోధ్య, ప్రయాగ త్రివేణి సంగమం, కాశీ ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని తీర్థయాత్ర స్థలాలు. బిహార్‌లో బుద్ధ భగవానుడు జ్ఞానోదయం పొందిన గయ, ఆయన జీవితంతో ముడిపడిన రాజ్‌గిర్, నలంద తదితర ప్రదేశాలు దర్శనీయాలు.

### ఒడిశా-పశ్చిమబెంగాల్


ఒడిశా రాజధాని భువనేశ్వర్ దేవాలయాల నగరంగా ప్రసిద్ధి చెందింది. దగ్గర్లోనే పూరీ జగన్నాథ దేవాలయం, కోణార్క్ సూర్యదేవాలయం పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తాయి. బెంగాల్‌లో రాజధాని కోల్‌కతా నగరంతోపాటు శాంతినికేతన్, డార్జిలింగ్ చూడదగ్గ ప్రదేశాలు. హిమాలయాల ఒడిలో

ఒదిగిపోయిన సిక్కిం రాష్ట్రం డార్జిలింగ్‌కు దగ్గరే.

### ఈశాన్య భారతదేశం

అసోంతో కలుపుకొని ఏడు రాష్ట్రాలు భాగంగా ఉండే ఈశాన్య దేశంలో కామాఖ్య దేవాలయం, బ్రహ్మపుత్ర నదిలో మజూలీ ద్వీపం, అరుణాచల్‌లో తవాంగ్‌లోయ మొదలైనవి చూడదగ్గ ప్రదేశాలు. ఢిల్లీతోపాటు చూడాలనుకుంటే పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, కశ్మీర్, లఢఖ్ ప్రాంతాలను కూడా పర్యాటక జాబితాలో చేర్చుకోవచ్చు. కేదార్‌నాథ్, బదరీనాథ్, గంగోత్రి, హరిద్వార్ తదితర ప్రదేశాలతో అలరారే దేవభూమి ఉత్తరాఖండ్ కూడా ఢిల్లీ ద్వారా వెళ్లగలిగే పర్యాటకుల స్వర్గధామమే.

# క్రాంతి వర్సెస్ కాంతి



రాత్రి తొమ్మిది కావొస్తున్నది. ఏదో కేసు ఫైల్ చూస్తున్నాడు ఇన్‌స్పెక్టర్ రుద్ర. ఇంతలో మొబైల్ మోగింది. 'సార్.. ఓఆర్ఆర్ మీద ఒక వ్యక్తి చనిపోయి ఉన్నాడు. మీరు త్వరగా రండి'.. ఫోన్‌లో అటునుంచి ఎవరో కంగారుపడుతూ చెప్పాడు. వివరాలు తీసుకొన్న రుద్ర సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకొన్నాడు. మృతుడి వయసు 20 ఏండ్లకు అటూ ఇటూగా ఉంటుంది. శరీరాన్ని ఏదో జంతువు రక్కిన గుర్తులు కూడా ఉన్నాయి. 'ఫోన్ చేసింది మీరేనా?' ఎదురుగా ఉన్న వ్యక్తిని ప్రశ్నించాడు రుద్ర. 'అవును సార్. నేనే మీకు ఫోన్ చేశా' సమాధానమిచ్చాడు అతను. 'మీ పేరు? ఈ టైమ్‌లో మీరు ఇక్కడేం చేస్తున్నారు? ఓఆర్ఆర్‌పై ఎందుకు ఆగినట్టు?' సూటిగా ప్రశ్నించాడు రుద్ర. 'సార్.. నా పేరు క్రాంతి. నేను కొత్తగా కొన్న నా ఎలక్ట్రిక్ కారులో వెళ్తున్నా. బ్యాటరీ డౌన్ కావడంతో కారు ఆగిపోయింది. చార్జింగ్ స్టేషన్లు కూడా దగ్గర్లో ఎక్కడా కనిపించలేదు. ఇంతలో ఎదురుగా రోడ్డు మీద జంతువు దేన్నో రక్కుతున్న శబ్దం వినిపించింది. ఏంటా అని కారు హెడ్‌లైట్లు ఆన్‌చేసి చూశా. ఎదురుగా శవం కనిపించింది. వెంటనే మీకు ఫోన్ చేశా' ఆందోళనతో క్రాంతి చెప్తూ పోయాడు. సరేనన్న రుద్ర.. క్రాంతి ఫోన్ నంబర్, ఇతర వివరాలు తీసుకొన్నాడు. ఇంతలో..'సార్.. ఇదేదో యాక్సిడెంట్ కేసులా కనిపిస్తుంది. పాపం కుర్రాడిది చిన్నవయసే' అంటూ బాధపడ్డాడు హెడ్‌కానిస్టేబుల్ రామస్వామి. 'అవును బాబాయ్. చిన్నవయసే. కానీ, ఇది యాక్సిడెంట్ కేసులా కనిపించట్లేదు. నిజంగా యాక్సిడెంట్ జరిగితే ఓఆర్ఆర్ మీద వాహనాలు వచ్చే స్పీడ్‌కు డెడ్‌బాడీ పరిస్థితి ఇంకోలా ఉండేది. అయితే ఈ కుర్రాడి శరీరం మీద ఏ కుక్కనో, నక్కనో రక్కినట్టు కొన్ని గుర్తులు ఉన్నాయి తప్ప మరేం గాయాలు కనిపించట్లేదు. ఏదేమైనా, ఫోరెన్సిక్ రిపోర్ట్ వచ్చాక గానీ మరిన్ని విషయాలు తెలియవు' అన్నాడు రుద్ర. అవునన్నట్టు తలూపాడు రామస్వామి. 'సార్.. నాకు లేట్ అవుతుంది. నేను వెళ్లొచ్చా?' క్రాంతి అడిగాడు. 'బ్యాటరీ డౌన్ అయ్యి కారు చెడిపోయింది అన్నారుగా. ఎలా వెళ్తారు?' ప్రశ్నించాడు రుద్ర. 'ఏదైనా క్యాబ్ బుక్ చేసుకొని వెళ్తా' సమాధానమిచ్చాడు క్రాంతి. 'మరి కారు?' మళ్లీ ప్రశ్నించాడు రుద్ర. 'రేపు వచ్చి కారు తీసుకుపోతాను సార్' మళ్లీ బదులిచ్చాడు క్రాంతి. 'హత్య గురించి ఇంతరాత్రి పూట మాకు విలువైన సమాచారం ఇచ్చారు. మిమ్మల్ని ఒక్కరినే అలా ఎలా పంపిస్తాం? మరేంపర్లేదు. మిమ్మల్ని మా కానిస్టేబుల్స్ ఇంటి దగ్గర విడిచిపెడతార'ని రుద్ర క్రాంతికి చెప్పాడు. ఫోరెన్సిక్ రిపోర్ట్ రాకముందే, ఆ కుర్రాడిది హత్య అని రుద్ర ఎలా కనిపెట్టాడని రామస్వామిసహా మిగతా కానిస్టేబుల్స్ అందరూ ఒక్కసారిగా షాక్ అయ్యారు. ఇంతలో 'నేను ఒంటరిగానే వెళ్తా సార్. పోలీసుల సాయం ఏమీ వద్దు' అంటూ కాస్త భయపడుతూ క్రాంతి అన్నాడు. 'ఎందుకు వద్దు?' గద్దించాడు రుద్ర. 'మాది పద్ధతిగల ఫ్యామిలీ సార్.. ఇంటికి పోలీసులు వస్తే, మా అమ్మానాన్న తట్టుకోలేరు' అన్నాడు క్రాంతి. 'మరి అంత పద్ధతిగల ఫ్యామిలీ నుంచి వచ్చిన నువ్వు.. ఈ కుర్రాడిని ఎందుకు చంపావ్?' బాంబు పేల్చాడు రుద్ర. ఒక్కసారిగా నిశ్శబ్ద వాతావరణం. 'సార్.. ఏం మాట్లాడుతున్నారు? యాక్సిడెంట్‌కు సంబంధించిన ఇన్ఫర్మేషన్ ఇవ్వడం కూడా తప్పేనా? అదే తప్పయితే ఇకపై ఎవరూ ఎవరికీ ఏ సాయం చేయరు. మానవత్వమే మంటగలిసిపోతుంది' అంటూ ఏడ్చినంత పని చేశాడు క్రాంతి. 'డియర్ క్రాంతి. ఈ సెంటిమెంటల్ డైలాగ్స్ ఇక ఆపడం నీకే బెటర్. ఈ హత్య నువ్వే చేశావని ఇప్పటికిప్పుడు నేను రుజువు చేయగలను. మర్యాదగా నువ్వే నిజం చెప్తే అది నీకే మంచిది' స్పష్టంగా అన్నాడు రుద్ర. కాస్త ఆలోచించాక.. ఏం పాలుపోని క్రాంతి.. ఆ హత్య తానే చేశానని ఒప్పేసుకొన్నాడు. అయితే ఆ కుర్రాడికి తనకు ఎలాంటి సంబంధంలేదని, తాను ఈ హత్య కావాలని చేయలేదని ఓ షాకింగ్ విషయం కూడా చెప్పాడు. అది విన్న రుద్ర అండ్ టీమ్‌కు ముచ్చెమటలు పట్టాయి. ఆ విషయం పక్కనబెడితే, క్రాంతినే ఆ కుర్రాడిని హత్య చేశాడని రుద్ర ఎలా కనిపెట్టాడు? ఓఆర్ఆర్‌పై పడివున్న కుర్రాడిని తానే హత్య చేశానని ఎట్టకేలకు ఒప్పుకొన్న క్రాంతి.. ఆ కుర్రాడికి తనకు ఎలాంటి సంబంధంలేదని, తాను ఈ హత్య కావాలని చేయలేదని చెప్పాడు. దీంతో మరెందుకు ఈ హత్య చేశావని ఇన్‌స్పెక్టర్ రుద్ర గద్దించాడు. దీనికి క్రాంతి స్పందిస్తూ.. 'సార్.. గత కొన్ని రోజులుగా నన్ను ఓ చీకటి శక్తి వెంటాడుతుంది. అది చెప్తేనే నేను ఈ అబ్బాయి మీదకు ఆ వాయువును వదిలా' అంటూ క్రాంతి చెప్తూ పోయాడు. ఆ మాటలు విన్న రుద్ర, హెడ్ కానిస్టేబుల్ రామస్వామి ఒకరి ముఖాలు ఒకరు చూసుకొన్నారు. 'ఏం బాబూ.. మేం మీకు ఎలా కనిపిస్తున్నాం? లాఠీకి పని చెప్పించేలా ఉన్నావే..' అంటూ కాస్త కరువుగా అంటున్న రామస్వామిని వారించిన రుద్ర.. క్రాంతిని స్టేషన్‌కు తీసుకురమ్మని పురమాయించాడు. మరుసటి రోజు.. 'మిస్టర్ క్రాంతి. హత్య చేశానని ఒప్పేసుకొన్నావ్. అంతవరకూ ఓకే. అయితే, అసలు కారణం ఏమిటన్నది మాత్రం చెప్పకుండా ఏదేదో మాట్లాడుతున్నావ్. ఇది నీకు మంచిదికాదు' అంటూ గంభీరంగా అన్నాడు రుద్ర. 'సార్.. హత్య నేనే చేశా. అయితే, నాకు తెలియకుండానే అది జరిగిపోయింది. అసలు ఆ అబ్బాయి ఎవరో కూడా నాకు తెలియదు' క్రాంతి నిశ్చయంగా చెప్పాడు. 'తెలియని అబ్బాయిని ఎందుకు చంపావ్?' ప్రశ్నించాడు రుద్ర. 'చెప్పాను కదా సార్.. ఓ చీకటి శక్తి చెప్తేనే చేశా' మళ్లీ అదే చెప్పాడు క్రాంతి. దీంతో క్రాంతి అబద్ధమైనా చెప్తుండాలి లేదా మతి స్థిమితంగానైనా లేకుండా ఉండాలి అని రుద్ర మనసులో అనుకొంటూ ఉండగా కుర్రాడి పోస్ట్‌మార్టం రిపోర్ట్ వచ్చింది.

**సమాధానం :** క్రైమ్ స్పాట్‌కు వచ్చీరాగానే 'ఈ టైమ్‌లో ఓఆర్ఆర్‌పై ఏం చేస్తున్నారం'టూ క్రాంతిని రుద్ర ప్రశ్నించాడు. దానికి తాను ఓఆర్ఆర్ మీదుగా కారులో వెళ్తుండగా బ్యాటరీ డౌన్ కావడంతో కారు ఆగిపోయిందని క్రాంతి బదులిచ్చాడు. ఇంతలో ఎదురుగా రోడ్డు మీద జంతువు దేన్నో రక్కుతున్న శబ్దం వినిపించి కారు హెడ్‌లైట్లు ఆన్‌చేసి శవాన్ని చూసినట్టు చెప్పాడు. నిజానికి కారు బ్యాటరీ డౌన్ అయ్యాక, హెడ్‌లైట్లు కూడా ఆన్ కావు. ఈ చిన్న లాజిక్‌నే రుద్ర కనిపెట్టాడు. పక్కనే ఉన్న టోల్‌ప్లాజా నుంచి కారు దాటడం సీసీటీవీలో రికార్డు కావడంతో భవిష్యత్తులో ఈ హత్య తనమీదకు వస్తుందని భావించిన క్రాంతి.. తాను తప్పించుకోవడానికి ఏమీ తెలియనట్టు తానే పోలీసులకు సమాచారమిచ్చాడు. అయితే, కారు బ్యాటరీ డౌన్ అయిందని అబద్ధం చెప్పి దొరికిపోయాడు. కాగా.. క్రాంతి ఈ హత్యను ఎందుకు చేశాడు? ఒక్క గాయం కనిపించకుండా కుర్రాడిని ఎలా చంపాడు? దీని వెనుక కారణమేంటన్న విషయాలపై రుద్ర టీమ్ దర్యాప్తు మొదలుపెట్టింది.

# రేగుపండ్లు అంటే ఇష్టమా?



తీపి, పులుపు, వగరు కలగలిసిన రుచితో ఉండే రేగుపండ్లు అంటే అందరికీ ఇష్టమే. ఈ సీజన్‌లో ఎక్కడ చూసిన బండ్లపై కనిపిస్తుంటాయి. ఈ పండ్లు కేవలం రుచికరంగా ఉండటమే కాకుండా అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంటాయంటున్నారు నిపుణులు. శరీరానికి కావాల్సిన పోషకాలు వీటిలో ఉంటాయని చెబుతున్నారు. ఈ క్రమంలో రేగుపండ్లు తినడం వల్ల ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం!

**రోగనిరోధక శక్తికి :** ఇందులో యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉంటాయంటున్నారు నిపుణులు. దీంతో శరీరంలో ఉత్పత్తయ్యే హానికర ఫ్రీ రాడికల్స్‌ను తొలగించి ఇన్‌ఫ్లమేషన్‌ని తగ్గించడం ద్వారా రోగనిరోధక శక్తి పెరుగుతుందని చెబుతున్నారు. అలాగే, ఇందులోని లిగ్నిన్ పీచు సైతం యాంటీఆక్సిడెంట్‌లా పనిచేసి రోగనిరోధక కణాల ఉత్పత్తికి తోడ్పడుతుందని తెలియజేస్తున్నారు. తద్వారా శరీరానికి వ్యాధుల మీద తిరగబడే శక్తి పెరుగుతుందని పేర్కొంటున్నారు. ఈ రెండు గుణాలవల్ల రేగుపండు డయాబెటిస్, గుండెజబ్బుల నుంచి రక్షిస్తుందని చెబుతున్నారు. ఇంకా, జలుబూ, ఫ్లూ ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ కల్పిస్తుందంటున్నారు.

**నిద్రకి :** రేగు పండ్లలో ఉండే 'శాపోనిన్' అనే పదార్థం మెదడును ప్రశాంతపరుస్తుందంటున్నారు నిపుణులు. ఇది సహజంగా నిద్ర పట్టేలా చేసి, నిద్రలేమి సమస్యను తగ్గిస్తుందని చెబుతున్నారు. ముఖ్యంగా, దీర్ఘకాలిక ఆందోళన, ఒత్తిడితో బాధపడేవాళ్లకి రేగుపండ్లు మంచి ఔషధమని సూచిస్తున్నారు. ఈ పండ్లతో మరిగించిన టీ తాగినా మంచిదంటున్నారు. చైనా, ఆసియాలోని ఇతర ప్రాంతాలలో రేగుపండ్లను నిద్రలేమి, ఆందోళన, మరిన్నింటికి నివారణగా చాలా కాలంగా ఉపయోగిస్తున్నారని ఎశ్రీవజవశ్రీఖఅనఎశ్రీఅఅఅఎ అధ్యయనం పేర్కొంది.

**క్యాన్సర్లకి:** రేగులోని విటమిన్-సికి యాంటీ క్యాన్సర్ గుణాలు ఉన్నాయని అధ్యయనం పేర్కొంది. ఈ పండ్ల నుంచి తీసిన ఎక్స్‌ట్రాక్ట్‌ను పేగు, గర్భాశయ, అండాశయ, రొమ్ము, చర్మ, కాలేయ క్యాన్సర్ల నివారణలో వాడినప్పుడు.. ఆయా కణాలను నాశనం చేసినట్లు స్పష్టమైందట.జీర్ణసంబంధిత వ్యాధులకి: రేగు పండ్లలో అధికంగా ఉండే పీచు పొట్ట గోడల్ని సంరక్షిస్తుందని నిపుణులు చెబుతున్నారు. తద్వారా హానికర బ్యాక్టీరియా, అల్సర్ల నుంచి కాపాడుతుందంటున్నారు. ఈ పండు మంచి ప్రొబయోటిక్‌గానూ పనిచేసి, పొట్టలో మంచి బ్యాక్టీరియా పెరిగేలా చేస్తుందని పేర్కొంటున్నారు. ఫలితంగా, కడుపులో మంటని తగ్గిస్తుందని వివరిస్తున్నారు. వీటి రసం నోటి పుండ్లు, గొంతు మంటనీ నివారిస్తుందని తెలియజేస్తున్నారు. అంతేకాదు, ఈ పండ్లు ఆకలినీ తగ్గిస్తాయట. తద్వారా బరువుని నియంత్రించుకోవచ్చని అంటున్నారు.

**అందానికి :** రక్తాన్ని శుద్ధి చేసే గుణాలు రేగుపండ్లలో ఉండటంతో చర్మ ఆరోగ్యాన్ని పరిరక్షిస్తాయంటున్నారు నిపుణులు. ఇవి ముఖంపై గీతలు, ముడతలను రానివ్వకుండా చర్మాన్ని మృదువుగా ఉంచుతాయని చెబుతున్నారు. అలాగే, ముందస్తు వృద్ధాప్య ఛాయలను దరికి చేరనీయవని తెలియజేస్తున్నారు. వీటిలోని పోషకాలు జుట్టు రాలకుండా కాపాడతాయని పేర్కొంటున్నారు.

**ఈ ప్రయోజనాలు కూడా! :**

రేగు పండ్లలో పొటాషియం, ఫ్లోరైడ్, ఇనుము పుష్కలంగా ఉంటుందని తీవంఖతీఎష్ట్రస్త్రఖ్వ అధ్యయనం పేర్కొంది. పొటాషియం కణాలు, శరీర ద్రవాలలో ఒక ముఖ్యమైన భాగంగా ఉండి, హృదయ స్పందన రేటును, రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుందని తెలిపింది.ఈ పండ్లలో సమృద్ధిగా ఉండే ఐరన్, ఫాస్పరస్‌లు రక్తకణ వృద్ధికి తోడ్పడటం ద్వారా రక్తహీనతనీ తగ్గిస్తాయి.ఆర్థరైటిస్ ఉన్నవారు ఈ పండ్లను తీసుకొంటే.. వీటిలోని కాల్షియం, ఫాస్పరస్ ఎముకలను దృఢంగా ఉంచుతాయని.. కీళ్లకు సంబంధించిన పలురకాల ఆరోగ్య సమస్యలకు ఈ పండు ఔషధంలా పనిచేస్తుందని అంటున్నారు. రేగు పండ్లలోని విటమిన్ సి , విటమిన్ కె, పొటాషియం వంటి పోషకాలు ఎముకలను బలపరుస్తాయని ఎశ్రీవజవశ్రీఖఅనఎశ్రీఅఅఅఎ అధ్యయనం పేర్కొంది.రక్తప్రసరణ సజావుగా జరిగి ఒత్తిడి, ఆందోళన వంటి సమస్యలు దరిచేరవు.కాలేయానికి సంబంధించిన సమస్యలకు దూరంగా ఉండొచ్చు.వీటిలోని పీచు జీర్ణాశయం పనితీరును మెరుగుపరిచి అజీర్తిని తగ్గిస్తుంది.గర్భిణులకెదురయ్యే వికారం, వాంతులు వంటి సమస్యలకు ఇది ఉపశమనాన్నిస్తుంది.మెనోపాజ్‌లోకి అడుగుపెట్టేటప్పుడు డి విటమిన్ తగ్గి ఎదురయ్యే కండరాల సమస్యలకు ఈ పండుతో చెక్ పెట్టొచ్చు. నెలసరిలో అధికస్రావాన్ని ఈ పండు తీసుకోవడం ద్వారా తగ్గించొచ్చని చెబుతున్నారు.

# క్రెడిట్ కార్డులు వరమా..? శాపమా..?



అప్పుల ఊబిని తప్పించే మార్గాలేవి!దుర్వినియోగం చేస్తే క్రెడిట్ కార్డులు అప్పుల ఊబిలోకి లాగేస్తాయి. కానీ క్రమశిక్షణతో వాడుతూ.. పూర్తిస్థాయిలో చెల్లింపులు జరిపి, ఖర్చులను అదుపులో పెడితే మీ రుణపరపతిని అమాంతం పెంచేస్తాయి. అధిక వడ్డీరేట్లు, ఆర్థిక ఒత్తిళ్లనూ అధిగమించవచ్చు. ఇంతకీ క్రెడిట్ కార్డులు.. వినియోగదారులపట్ల వరమా..? శాపమా..? రుణాల ఉచ్చు నుంచి తప్పించుకోవడానికున్న మార్గాలేవి?

దేశంలో క్రెడిట్ కార్డుల వినియోగం పెద్ద ఎత్తున పెరిగిపోయింది. గత కొన్నేండ్లలో క్రెడిట్ కార్డు యూజర్ల సంఖ్య జెట్ స్పీడ్‌తో పెరిగిపోయిందంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. మార్కెట్‌లో సులభంగానే క్రెడిట్ కార్డులు లభిస్తుండటం, ఆకర్షణీయ ఆఫర్లు, పెరిగిన వినిమయ శక్తి.. ఇవన్నీ కూడా ఇందుకు కారణమే. అయితే మితిమీరుతున్న క్రెడిట్ కార్డుల వినియోగం.. కార్డుదారులు, గృహస్తులను అప్పుల ఊబిలోకి లాగుతున్నదన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయిప్పుడు. కానీ రుణ సాధనాలను వాడుతున్నప్పుడు క్రెడిట్ కార్డు వినియోగదారులు ఎలా ఉంటున్నారు? మరెలా ఆలోచిస్తున్నారు? అన్నది ఇక్కడ ప్రశ్న. మరి దీనిపై ఆర్థిక నిపుణులు ఏమంటున్నారు?

**ఇదీ సంగతి..**

అధిక వడ్డీరేట్లు క్రెడిట్ కార్డు వినియోగదారులను అప్పుల ఊబిలో పడేస్తున్నాయి. దేశంలో ప్రస్తుతం వాడకంలో ఉన్న చాలా క్రెడిట్ కార్డులపై యూజర్లు గడువులోగా బకాయిలను చెల్లించకపోతే గరిష్ఠంగా 30 నుంచి 42 శాతం చార్జీలు పడుతున్నాయి. చిన్నచిన్న బకాయిలపైనా వడ్డీ భారం తడిసి మోపెడవుతున్నది. ఇక ఎడాపెడా ఖర్చులు చేసి, ఆపై మొత్తం బకాయిలను చెల్లించకుండా చాలామంది మినిమం పేమెంట్స్‌తోనే సరిపెడుతున్నారిప్పుడు. దీనివల్ల కార్డును అప్పటికప్పుడు యాక్టివ్‌గా ఉంచుకుంటున్నా.. దీర్ఘకాలంలో మాత్రం యూజర్లు అప్పుల ఊబిలో పడే ప్రమాదం ఏర్పడుతున్నది. ‘ఇప్పుడు వాడుకోండి.. ఆ తర్వాత చెల్లించండి’, ‘సులభ వాయిదాల్లో పేమెంట్స్ చేయండి’.. ఇలా రకరకాల ఆఫర్లు క్రెడిట్ కార్డు యూజర్లను అవసరం లేకపోయినా ఖర్చులకు ప్రేరేపిస్తున్నాయి. ఫలితంగా చివరకు డిఫాల్టర్లుగా మిగిలిపోతున్నవారెందరో.

**ఇవే సమస్యలు**

క్రెడిట్ కార్డు వినియోగదారుల్లో చాలామందికి ఆర్థిక క్రమశిక్షణ అంతంతమాత్రంగానే ఉంటున్నది. బకాయిలను ఎప్పటికప్పుడు క్లియర్ చేయకుండా.. తదుపరి నెలల్లోకి తీసుకెళ్లడం వారిపై రుణ భారాన్ని పెంచేస్తున్నది.

నిజానికి క్రెడిట్ కార్డు రుణ నిర్వహణ అనేది చాలా కీలకం. ప్రభావవంతంగా, వివేకంతో వినియోగిస్తేనే లాభదాయకం.

బ్యాంకులు ఇస్తున్నాయి కదా.. అని చాలామంది అనేక కార్డులను తీసుకుంటున్నారు. దీనివల్ల రీపేమెంట్లు అస్తవ్యస్తంగా తయారవుతున్నాయి.

క్రెడిట్ కార్డులతో ఏటీఎంల్లో నగదు ఉపసంహరణలు చేస్తున్నారు. అయితే ఈ లావాదేవీలకు అధిక ఫీజులుంటాయి. మొదటి రోజు నుంచే చార్జీలు వర్తిస్తాయి. తెలియకుండానే భారం పడుతుంది.

క్రెడిట్ కార్డులను అజాగ్రత్తగా వాడితే అప్పుల కుప్పే. క్రమశిక్షణతో వినియోగిస్తేనే సత్ఫలితాలుంటాయి. అందుకే క్రెడిట్ కార్డును ఓ స్వల్పకాలిక రుణంగా భావించాలి. కొనుగోళ్లు, ఖర్చులపై అవగాహన ఉండాలి. బకాయిలను పూర్తిగా చెల్లిస్తే రుణ పరపతి పెరుగుతుంది. ఇస్తున్నారుకదా అని ప్రతీ కార్డునూ తీసుకోవద్దు. రెండుకు మించి క్రెడిట్ కార్డులుంటే రుణ భారమే. కార్డుకున్న రుణ పరిమితిని పూర్తిగా వాడుకోవద్దు. 70 శాతం మించి వాడకపోవడమే మంచిది.-కుందన్ షాహి, జవో వ్యవస్థాపకుడు

**ఇలా చేయండి..**

క్రెడిట్ కార్డు బకాయిలను క్లియర్ చేయడానికి నెలవారీ రీ-పేమెంట్ రూల్‌ను పెట్టుకోండి. మినిమం బ్యాలెన్స్‌లు కాకుండా పూర్తిస్థాయిలో బకాయిలను చెల్లించండి. క్రెడిట్ లిమిట్‌ను మీ ఖర్చులకున్న పరిమితిగా భావిస్తే అనవసరపు వ్యయాలను దూరం పెట్టవచ్చు. ఖర్చులను తెలుసుకోవడానికి డిజిటల్ యాప్‌లు, స్టేట్‌మెంట్లను వాడండి. రివార్డులను రిడీమ్ చేసుకోండి. కానీ వాటిని వాడుకోవద్దు.

# మీ చిన్నారులకు పాన్ కార్డ్ తీసుకోండి.. ఇన్వెస్ట్‌మెంట్‌పై అవగాహన కల్పించండి!




ఏదైనాసరే చిన్నప్పటినుంచీ చేస్తే అది ఒక హాబీగా, ఆ రంగంలో నిష్ణాతులుగా మారే అవకాశం చాలా ఎక్కువ. అది సాంస్కృతిక అంశాలైనా, క్రీడలైనా లేదా పొదుపు, పెట్టుబడులైనా. ఆయా అంశాల్ని చిన్నారులకు అలవాటు చేయడం కూడా తల్లిదండ్రుల బాధ్యత.

ఇంటర్నెట్ డెస్క్: ఇప్పుడు, మైనర్లు (18 సంవత్సరాల వయసు లోపు వారు) కూడా పాన్ కార్డ్ తీసుకోవచ్చని మీకు తెలుసా. ఇన్‌కమ్ ట్యాక్స్ విభాగం ఇటీవల చిన్నారులకు(మైనర్లు) పాన్ కార్డ్ ఆవశ్యకతపై ఓ ప్రత్యేక ఈ-క్యాంపెయిన్ కూడా చేపట్టింది. చిన్నారుల తల్లిదండ్రులు లేదా సంరక్షకులు వారి ప్రతినిధులుగా పాన్ కార్డు కోసం దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. దేశంలో నివసించే వారితో పాటు నాన్ రెసిడెంట్ ఇండియన్స్ పాన్ కార్డ్ తీసుకోవచ్చు. ఇందుకోసం ఆన్‌లైన్ లో అప్లై చేసి పొందవచ్చు. అయితే, మైనర్లు స్వయంగా పాన్ కార్డ్ కోసం దరఖాస్తు చేయడం వీలుకాదు. వారి తల్లిదండ్రులు, లేదా సంరక్షకులు లేదా రిప్రెజెంటేటివ్ అసెస్సీలు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండు విధాలుగా అప్లై చేయొచ్చు. పిల్లలు భారత్‌లో నివసిస్తున్నా, ఎన్‌ఆర్‌ఐ అయినా పాన్ కార్డ్ కోసం దరఖాస్తు చేయవచ్చు.

ఇందుకోసం ఆన్‌లైన్ విధానంలో సంబంధిత అధికారిక వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఫామ్ నింపాలి. అవసరమైన డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాలి. ఆ ఫామ్స్ ఆఫ్‌లైన్ విధానంలో PAN కేంద్రానికి పంపించాలి. మైనర్‌కు జారీ చేసిన పాన్ కార్డ్‌లో వారి ఫోటో, సంతకం ఉండదు. 18 ఏళ్ల వయసు నిండిన తర్వాత, ఫోటో, సంతకంతో కొత్త కార్డ్ కోసం అప్లై చేయాల్సి ఉంటుంది. అయితే, పాన్ నంబర్ మాత్రం పాతదే కొనసాగుతుంది.

**పెట్టుబడుల మీద చిన్నారులకు అవగాహన:**

నేటి పోటీ ప్రపంచంలో చిన్నారులకు చిన్నతనం నుంచే పొదుపు, పెట్టుబడుల ఆవశ్యకత పట్ల వారిని నేరుగా ఇన్వాల్వ్ చేసే వీలుంటుంది. చిన్నారులకు వారి పేరుపై పాన్ కార్డ్ ఉంటే, డీమ్యాట్ అకౌంట్ ఓపెన్ చేసి, షేర్లు కొనుగోలు చేయవచ్చు. కానీ ఇది పూర్తిగా తల్లిదండ్రులు లేదా చట్టపరమైన గార్డియన్ (లీగల్ గార్డియన్) పర్యవేక్షణలోనే జరుగుతుంది. మైనర్‌లు ట్రేడింగ్ లేదా సెల్(అమ్మకాలు) చేయలేరు. ఎందుకంటే ఇండియన్ కాంట్రాక్ట్స్ యాక్ట్, 1872 ప్రకారం వారు ఆర్థిక ఒప్పందాల్లో పాల్గొనలేరు. అయితే, కంపెనీస్ యాక్ట్, 2013 ప్రకారం ఏ వయస్సు ఉన్నా షేర్లు కలిగి ఉండవచ్చు. ఇంట్రాడే, F&O, కరెన్సీ డెరివేటివ్స్ వంటివి మాత్రం చేయకూడదు. అయితే, మైనర్స్ అకౌంట్‌ను గార్డియన్ మాత్రమే ఆపరేట్ చేయాలి. షేర్లు గిఫ్ట్ రూపంలో మాత్రమే ట్రాన్స్‌ఫర్ చేయవచ్చు. 18 సంవత్సరాల తర్వాత మైనర్.. మేజర్ అయినప్పుడు, అకౌంట్ కొనసాగించవచ్చు కానీ కొత్త కేవైసీ , అప్లికేషన్ సబ్మిట్ చేయాలి.

**చిన్నారులకు పాన్ కార్డు వల్ల ఇతర లాభాలు:**

చిన్నారుల పేర బ్యాంక్‌లో ఖాతా తెరవడానికి సులభమవుతుంది. పిల్లల పేరుతో ఫిక్స్‌డ్ డిపాజిట్ , రికరింగ్ డిపాజిట్ లాంటి ఖాతాలు తెరవడానికి పాన్ కార్డు చాలా ఉపయోగపడుతుంది. చిన్నారుల పేర మ్యూచువల్ ఫండ్స్, SIPలలో పెట్టుబడులకు వీలు కలుగుతుంది. అంతేకాదు, ఫైనాన్షియల్ ఐడెంటిటీ చిన్న వయసులోనే చిన్నారులకు బిల్డ్ అవుతుంది.

# రిస్క్ లేకుండా మంచి రాబడి కావాలా..

## - డెట్ ఫండ్స్ బెస్ట్ ఆప్షన్- కానీ ఈ విషయాలు తెలుసుకోవాల్సిందే!

## డెట్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయాలా ఈ విషయాలు కచ్చితంగా తెలుసుకోండి!



స్టాక్ మార్కెట్‌లో ఒడుదొడుకులు సహజం. అందువల్ల స్వల్పకాలంలో నష్టభయం ఎక్కువగా ఉంటుంది. అందుకే చాలా మంది డెట్ పథకాలవైపు మొగ్గు చూపుతారు. అయితే డెట్ ఫండ్స్‌లో కూడా రిస్క్ ఉంటుంది. కనుక డెట్ పథకాలు పూర్తిగా సురక్షితం అనే అపోహలు వీడడం మంచిది. అందుకే డెట్ ఫండ్లలో ఇన్వెస్ట్ చేసే ముందు కొన్ని కీలక విషయాలు కచ్చితంగా తెలుసుకోవాలి. అవేంటో ఇప్పుడు చూద్దాం.

**1. మీ లక్ష్యం ఏమిటి?**

డెట్ ఫండ్స్ ప్రధానంగా గవర్నమెంట్ బాండ్లు, ట్రెజరీ బిల్లులు, కార్పొరేట్ బాండ్లు మొదలైన పథకాల్లో మదుపు చేస్తాయి. సాధారణ ఈక్విటీ పథకాలతో పోలిస్తే, వీటి పెట్టుబడి వ్యూహం కాస్త భిన్నంగా ఉంటుంది. కొన్ని ఫండ్లు మూడేళ్ల పరిమితి ఉన్న బాండ్లలో ఇన్వెస్ట్? చేస్తాయి. మరికొన్ని స్వల్పకాలిక పథకాల్లో మదుపు చేస్తాయి. కనుక డెట్ ఫండ్లలో మదుపు చేసే ముందు మీ ఆర్థిక లక్ష్యం, వ్యూహం గురించి కచ్చితంగా ఆలోచించుకోవాలి.

**2. వ్యవధి?**

డెట్ ఫండ్లు ప్రధానంగా వివిధ వ్యవధులు కలిగిన బాండ్లు, సెక్యూరిటీల్లో మదుపు చేస్తాయి. కొన్ని డెట్ ఫండ్స్ వారం వ్యవధి ఉన్న బాండ్లలోనూ పెట్టుబడులు పెడతాయి. మరికొన్ని మూడేళ్ల వ్యవధి ఉన్న బాండ్లలో ఇన్వెస్ట్ చేస్తాయి. కనుక, మీరు ఎంత కాలం పెట్టుబడిని కొనసాగించాలని అనుకుంటున్నారో ముందుగానే నిర్ణయించుకోవాలి. మీరు మదుపు చేయాలనుకుంటున్న డెట్ ఫండ్ వివిధ పథకాల్లో ఎంత వ్యవధి పాటు ఇన్వెస్ట్‌మెంట్ కొనసాగిస్తుందన్న విషయాన్ని తెలుసుకోవాలి. దీనివల్ల ఏ స్థాయిలో మీకు రాబడి వస్తుందో ముందుగానే ఒక అంచనాకు రావచ్చు. ఉదాహరణకు ఒక ఫండ్ సగటున మూడేళ్ల వ్యవధి ఉన్న పథకాల్లో మదుపు చేస్తుందని అనుకుందాం. అప్పుడు 2 నుంచి 3 ఏళ్ల వరకు పెట్టుబడిని కొనసాగించాలనుకున్నవారే ఆ డెట్ ఫండ్‌ను ఎంచుకోవాలి.

**3. రాబడి మాటేమిటి?**

ఇన్వెస్టర్లు గుర్తించుకోవాల్సిన అంశం ఏమిటంటే, వడ్డీ రేట్లు పెరిగినప్పుడు, డెట్ ఫండ్ల రాబడి తగ్గుతుంది. వడ్డీ రేట్లు తగ్గితే, డెట్? ఫండ్ల నుంచి కాస్త అధిక రాబడి వస్తుంది. అందుకే వివిధ సందర్భాల్లో డెట్ ఫండ్స్ అందించిన ప్రతిఫలాన్ని బేరీజు వేసుకోవాలి. నిపుణుల ప్రకారం, డెట్ ఫండ్ల నుంచి సగటున 7-9 శాతం వరకు రాబడిని ఆశించవచ్చు.

**4. గతం గతః**

గత రాబడులు, భవిష్యత్ రాబడికి హామీ ఇవ్వవని మదుపరులు గుర్తుంచుకోవాలి. చరిత్ర అనేది కేవలం ఒక అంచనాకు రావడానికి మాత్రమే ఉపయోగపడుతుంది. కనుక వివిధ మార్కెట్ పరిస్థితుల్లో డెట్ ఫండ్స్ పనితీరు ఎలా ఉందనేది బేరీజు వేసుకొని, ఒక సరైన నిర్ణయానికి రావాలి. ఏడాది, మూడు, ఐదేళ్ల కాల వ్యవధుల్లో సదరు ఫండ్ ఎలా పనిచేసింది? ఎంత రాబడి ఇచ్చింది? అనేది చూడాలి. డెట్? ఫండ్స్ రాబడి ప్రామాణిక సూచీలను అధిగమించిందా? లేదా ఆయా విభాగాల్లోని ఇతర ఫండ్లతో పోల్చి చూసినప్పుడు, మెరుగైన రాబడులను ఇచ్చిందా? అనేది చూసుకోవాలి. పెట్టుబడులు పెట్టేటప్పుడు కచ్చితంగా పరిశోధన చేయాల్సి ఉంటుందని మరిపోకూడదు.

**5. రేటింగ్స్ చూడాలి!**

డెట్ ఫండ్లపై వచ్చే రాబడి వడ్డీ రేట్లతో పాటు, అది మదుపు చేసే వివిధ బాండ్ల రేటింగ్స్‌పై ఆధారపడి ఉంటుంది. సాధారణంగా మంచి కంపెనీల బాండ్లకు క్రెడిట్ రేటింగ్ అధికంగా ఉంటుంది. %ూూూూ% రేటింగ్ ఉన్న బాండ్లలో మదుపు చేసినప్పుడు, ఆ డెట్ ఫండ్స్‌లో నష్టభయం కాస్త తక్కువగా ఉంటుంది. అయితే చాలా మంది ఎక్కువ వడ్డీ రేటుకు ఆశపడి, తక్కువ రేటింగ్? ఉన్న డెట్? ఫండ్లలో మదుపు చేస్తుంటారు. కానీ ఇలా చేయడం ఏ మాత్రం శ్రేయస్కరం కాదు.

**6. పెద్ద ఫండ్లలోనే!**


డెట్ ఫండ్లను ఎంచుకునేటప్పుడు, ఆయా ఫండ్ల కింద, నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువను (ఏయూఎం) కూడా పరిశీలించాలి. అధిక ఏయూఎం ఉన్న డెట్ ఫండ్‌లలో నష్టభయం కాస్త తక్కువగా ఉంటుంది. పెట్టుబడి సులభంగా వెనక్కి తీసుకునేందుకూ వీలుంటుంది.

# AI తో పొంచి ఉన్న రిస్క్‌లు ఏమిటి? దాన్ని సేఫ్‌గా వినియోగించడం ఎలా?

## ఏఐ టూల్స్ వినియోగించే వేళ ఎన్నో రిస్క్‌లు

## - మనుషుల్లాగే ఏఐకి కూడా పక్షపాత వైఖరి

## - ఏఐను సేఫ్‌గా వాడే టిప్స్ ఇవిగో!




: ఇది కృత్రిమ మేధ (ఏఐ) యుగం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ అత్యంత వేగంగా అన్ని రంగాల్లో వేళ్లూనుకుంటోంది. ఏఐ టూల్స్ చాలా పనులను మనుషుల కంటే అత్యంత వేగంగా పూర్తి చేస్తున్నాయి. దీంతో ఇప్పటికే చాలా రంగాల కంపెనీలు వీటి వినియోగాన్ని మొదలుపెట్టాయి. నాణేనికి బొమ్మా, బొరుసు ఉన్నట్టే, ఏఐ టెక్నాలజీకి ప్లస్ పాయింట్లు, మైనస్ పాయింట్లు ఉన్నాయి. ఇంతకీ ఏఐను వినియోగించే క్రమంలో పొంచి ఉండే రిస్క్‌లు ఏమిటి? వర్క్ ప్లేస్‌లలో ఏఐను సురక్షితంగా ఉపయోగించేందుకు ఏయే సేఫ్టీ టిప్స్‌ను ఫాలో కావాలి? అనేది ఈ కథనంలో తెలుసుకుందాం.

**1. పక్షపాతం** : ఏఐ టెక్నాలజీని, ఏఐ టూల్స్‌ను తయారు చేసేది మనుషులే. అందుకే వాటిపై మనిషి ఆలోచనా విధానం ప్రభావం ఉంటుంది. మనుషులు పక్షపాత ధోరణితో ఆలోచిస్తారు. అందుకే మనుషుల చేతిలో పురుడు పోసుకున్న ఏఐ టూల్స్ కూడా పక్షపాతంతోనే పనులు చేస్తాయి. ఉదాహరణల్లోకి వెళితే, దరఖాస్తుదారులను ట్రాక్ చేసే ఏఐ టూల్ అనేది ‘మహిళల’పై వివక్ష చూపొచ్చు. ‘ప్రెడిక్టివ్ పోలీసింగ్’ టూల్ అన్యాయంగా అణగారిన వర్గాలను లక్ష్యంగా చేసుకునే ముప్పు ఉంటుంది.

**2. సైబర్ సెక్యూరిటీ ముప్పులు :** ప్రస్తుతం వినియోగంలో ఉన్న జనరేటివ్ ఏఐ టూల్స్‌లో 24 శాతమే సురక్షితమైనవి. ఏఐ టూల్స్‌పై సైబర్ దాడులకు పాల్పడేందుకు హ్యాకర్లు యత్నించే ముప్పు ఉంటుంది. ఆ టూల్‌ను హ్యాక్ చేసి, అందులోని విలువైన సమాచారాన్ని దొంగిలించడం వారి లక్ష్యంగా ఉంటుంది. అదే జరిగితే కంపెనీ వద్దనున్న వ్యక్తులు, ఇతరత్రా సంస్థల సమాచారం గోప్యత, భద్రతలకు భంగం వాటిల్లుతుంది.

**3. డాటా ప్రైవసీ సమస్యలు** : చాలా జనరేటివ్ ఏఐ యాప్‌లలో లార్జ్ ల్యాంగ్వేజ్ మోడల్స్ (ఎల్ఎల్ఎంలు) ఉంటాయి. వర్చువల్ అసిస్టెంట్లు, కన్వర్జేషనల్ ఏఐ ఛాట్‌బోట్ వంటి వాటిలోనూ ఎల్ఎల్ఎం ఏఐ మోడల్సే ఉంటాయి. చాలా భారీ ట్రైనింగ్ డాటాను క్రోడీకరించి ఎల్ఎల్ఎంలను తయారు చేస్తారు. ‘వెబ్ క్రాలర్’ అనే టూల్స్ చాలా వెబ్‌సైట్లలోకి వెళ్లి ఈ డాటాను సేకరిస్తుంటాయి. ఈక్రమంలో కొన్ని వెబ్‌సైట్ల అనుమతిని పొందకుండానే, వాటిలోని సమాచారాన్ని వెబ్ క్రాలర్లు తీసుకుంటాయి. ఇలాంటప్పుడు ఆ సమాచారంలోకి వ్యక్తిగత వివరాలు చేరిపోవచ్చు. దీనివల్ల ఆయా వ్యక్తుల గోప్యతకు భంగం కలుగుతుంది.

**4. పర్యావరణ ముప్పులు :** ఏఐ టెక్నాలజీ కంప్యూటర్ తెరపై చూడటానికి సింపుల్‌గా ఉంటుంది. కానీ తెర వెనుక, దాని కోసం ఎంతో క్లిష్టతరమైన ప్రాసెసింగ్ ప్రక్రియ జరుగుతుంది. ఈక్రమంలో పెద్దఎత్తున కర్బన ఉద్గారాలు వాతావరణంలోకి రిలీజ్ అవుతాయి. భారీ డాటా సెట్‌లపై ఏఐ అల్గారిథమ్‌లకు ట్రైనింగ్ ఇచ్చే క్రమంలో భారీ ఇంధన వినియోగం జరుగుతుంది. ఓ అధ్యయనం ప్రకారం ఒక నేచురల్ ల్యాంగ్వేజ్ ప్రాసెసింగ్ మోడల్ నుంచి దాదాపు 6 లక్షల పౌండ్లకుపైగా కార్బన్ డయాక్సైడ్ రిలీజ్ అవుతుంది. ఒక కారు జీవితకాలంలో విడుదల చేసే కర్బన ఉద్గారాల కంటే ఇది దాదాపు 5 రెట్లు ఎక్కువ. చాలా ఏఐ యాప్‌లు డాటా సెంటర్లలోని సర్వర్లపై ఆధారపడి పనిచేస్తుంటాయి. ఆ సర్వర్లను చల్లార్చడానికి చాలా నీరు అవసరం.

**5. ఉనికికి ముప్పు :** ఏఐ వేగంగా కొత్త పుంతలు తొక్కితే మానవాళి మేధస్సును దాటేయగలదు అని ‘ఏఐ గాడ్ ఫాదర్’ జెఫ్రీ హింటన్ ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు సైంటిస్టులు ఏఐ టెక్నాలజీని అణు యుద్ధం, కరోనా మహమ్మారి తరహా సంక్షోభాలతో పోల్చారు. ఏఐ టూల్స్ వల్ల ఎంతో మంది ఉద్యోగాలను కోల్పోతారనే ఆందోళన కూడా వ్యక్తమవుతోంది.

**6. మేధో సంపత్తి ఉల్లంఘన :** జనరేటివ్ ఏఐ చిత్రవిచిత్రాలు చేస్తోంది. అది ఫొటోలను క్రియేట్ చేస్తోంది. పాటలను, పద్యాలను పాడుతోంది. కథలను రాస్తోంది. అయితే ఏఐ కంటెంట్‌పై కాపీరైట్ ఎవరిది అనే ప్రశ్న ఉదయిస్తోంది. ఆ కథను రాసిన ఏఐ యాప్‌కు కాపీ రైట్ దక్కాలా? దానితో ఆ కథను రాయించిన వ్యక్తికి కాపీరైట్ దక్కాలా? అనేది బిగ్ క్వశ్చన్. భవిష్యత్తులో ఈ అంశం కంపెనీలు, సంస్థలకు సవాల్‌గా మారే ఛాన్స్ ఉంది.

**7. ఉద్యోగ కోతలు :** ఏఐ ఆటోమేషన్ టూల్స్ వల్ల భవిష్యత్తులో భారీగా ఉద్యోగ కోతలు జరుగుతాయనే ప్రచారం జరుగుతోంది. అయితే ఏఐ వల్ల కొంతకాలం పాటే ఉద్యోగ కోతలు జరుగుతాయని, ఆ తర్వాత కొత్త ఉద్యోగాలు క్రియేట్ అవుతాయని వరల్డ్ ఎకనామిక్ ఫోరం అంటోంది. మెషీన్ లెర్నింగ్ స్పెషలిస్టులు, రోబోటిక్ ఇంజినీర్లు, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ స్పెషలిస్టుల పోస్టులు భారీగా ఏర్పడొచ్చు.

**8. జవాబుదారీతనం నిల్ :** ఉద్యోగులు జవాబుదారీగా ఉంటారు. కానీ ఏఐ టూల్స్ కొన్నిసార్లు జవాబుదారీగా ఉండకపోవచ్చు. అవి తప్పుడు ఫలితాలు లేదా తప్పుడు నిర్ణయాలను తీసుకునే ఛాన్స్ ఉంటుంది. దీనివల్ల సంస్థలకు చెందిన కీలక సాంకేతిక వ్యవస్థలు క్రాష్ అయ్యే గండం పొంచి ఉంటుంది.

**9. వివరణ, పారదర్శకత అంతంతే :** ఏఐ అల్గారిథమ్‌లు, ఏఐ మోడల్స్ పనిచేసే తీరు, అవి నిర్ణయాలు తీసుకునే విధానం అనేవి పెద్ద మిస్టరీలు. అందుకే ఏఐ టూల్స్ ద్వారా వచ్చే ఫలితానికి మనం తగిన వివరణను పొందలేకపోవచ్చు.

**10. తప్పుడు సమాచారం :** ఏఐ టూల్స్‌పై హ్యాకర్లు దాడి చేసే, దాని ద్వారా వచ్చే ఫలితాన్ని/సమాచారాన్ని మార్చివేసే ముప్పు ఉంటుంది. ఉదాహరణకు అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్ గొంతుతో ఏఐ జనరేటెడ్ రోబో కాల్స్ చాలా మంది అమెరికన్లకు వెళ్లాయి. ఓట్లు వేయడానికి పోలింగ్ కేంద్రాలకు వెళ్లొద్దు అనేది ఆ కాల్ సమాచారం. ఈ విధంగా తప్పుడు సందేశం ఇచ్చేలా ఏఐ టూల్స్‌ను హ్యాకర్లు దుర్వినియోగం చేసే గండం ఉంటుంది.

వాస్తవానికి ఈ జాగ్రత్తలు కేవలం కంపెనీలు మాత్రమే తీసుకుంటే సరిపోదు. వాటి వినియోగించే ప్రతి ఒక్క యూజర్ కూడా పాటించాలి. లేకుంటే నష్టపోయే ప్రమాదం ఉంటుంది. తస్మాత్ జాగ్రత్త!




# సెన్సెక్స్30లోకి ఇండిగో

న్యూఢిల్లీ : ఇండిగో పేరుతో విమాన సేవలు అందిస్తున్న ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్..బీఎస్‌ఈ సెన్సెక్స్ 30 సూచీలోకి ప్రవేశించనున్నది. వచ్చే నెల 22 నుంచి ఇది అందుబాటులోకి రానున్నట్టు పేర్కొంది. దీంతో ఇప్పటి వరకు ట్రేడైన టాటా మోటర్స్ ప్యాసింజర్ వేహికల్ ఈ సూచీ నుంచి వైదొలగనున్నది. ఈ విషయాన్ని బీఎస్‌ఈ ఇండెక్స్ సర్వీసెస్ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. సూచీల పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఈ మార్పులు చేసినట్టు బీఎస్‌ఈ ఇండెక్స్ వెల్లడించింది. అలాగే బీఎస్‌ఈ 100 ఇండెక్స్‌లో అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ స్థానంలో ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ చోటు దక్కించుకున్నది. అలాగే బీఎస్‌ఈ సెన్సెక్స్ 50లో ఇండస్‌ఇండ్ బ్యాంక్ లిమిటెడ్ స్థానంలో మ్యాక్ హెల్త్‌కేర్ ఇనిస్టిట్యూట్ లిమిటెడ్ భర్తీకానున్నది.

# గ్లోబల్ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు




దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా కదలాడవచ్చు. క్రితం వారం ప్రారంభంలో రాణించిన సూచీలు గ్లోబల్ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాల తో ఆఖరిలో చతికిలపడ్డాయి. రూపాయి పతనం, యెన్, డాలర్ బాండు రాబడుల పెరుగుదల, అనిశ్చితి, యూఎస్ ఫెడ్ నిర్ణయాలు కీలకమవుతాయి. ప్రస్తుతం ఐటీ, ఆటో, ఫార్మా, ఫైనాన్స్ రంగాల షేర్లు జోరు ప్రదర్శిస్తున్నాయి.

**స్టాక్ రికమెండేషన్స్**

ఎస్‌బీఐ కార్డ్: ప్రస్తుతం ఈ షేర్లు మధ్యకాలిక అప్‌ట్రెండులో ఉన్నాయి. తాజా ఫలితాల తర్వాత 12% వరకు దిద్దుబాటుకు లోనయ్యాయి. కీలకమైన రూ.880 స్థాయిలో మరోసారి మద్దతు లభించింది. గత శుక్రవారం రూ.878 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.990 టార్గెట్ ధరతో రూ.850పై స్థాయిలో పొజిషన్ తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ : రూ.830.

**ఐటీసీ:** గత ఏడాది సెప్టెంబరు నుంచి ఈ షేర్లు దాదాపుగా 20% మేర కుంగాయి. కీలక మద్దతు స్థాయి రూ.400కి చేరడంతో టర్న్ అరౌండ్ సూచనలు కనిపిస్తున్నాయి. గత శుక్రవారం రూ.407 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో ఇన్వెస్టర్లు రూ.455/470 టార్గెట్ ధరతో రూ.400పై స్థాయిలో ప్రవేశించవచ్చు. స్టాప్‌లాస్ : రూ.385.

**టెక్ మహీంద్రా:** ప్రస్తుతం ఐటీ రంగం టర్న్ అరౌండ్ అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. దీంతో టెక్ మహీం ద్రా షేర్లపై ఆసక్తి పెరిగింది. 52 వారాల గరిష్ఠం నుంచి 25% మేర పతనమైన ఈ షేర్లలో ఇప్పుడిప్పుడే మూమెంటమ్ పెరుగుతోంది. గత శుక్రవారం రూ.1461 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో ఇన్వెస్టర్లు రూ.1650 టార్గెట్ ధరతో రూ.1450 పై స్థాయిలో పొజిషన్లు తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ : రూ. 1420.


**హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్:** ఈ షేర్లలో గరిష్ఠ స్థాయుల్లో కన్సాలిడేషన్ కొనసాగుతోంది. మరోసారి ఇవి 10, 20, 50 డీఎంఏల పైన మద్దతు తీసుకున్నాయి. రిలేటివ్ స్ట్రెంత్ సైతం క్రమంగా పెరుగుతోంది. గత శుక్రవారం రూ.764 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.820 టార్గెట్ ధరతో రూ.750 శ్రేణిలో ప్రవేశించాలి. స్టాప్‌లాస్ : రూ.730

**ఎస్కార్ట్స్:** ఈ షేర్లు మధ్యకాలిక అప్‌ట్రెండ్‌లో కన్సాలిడేషన్ ట్రెండ్‌లో కొనసాగుతున్నాయి. వాల్యూమ్ తక్కువగా నమోదవ్వడాన్ని బట్టి ఇన్వెస్టర్ల ఆసక్తి కనిపిస్తోంది.




## మెగా బ్లాస్ట్..
## చిరంజీవి 'మన శంకరవర ప్రసాద్ గారు' ట్రైలర్ విడుదల

అగ్ర కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవి, స్టార్ దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రాబోతున్న తాజా చిత్రం 'మన శంకరవర ప్రసాద్ గారు'. ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను చిత్ర బృందం ఈరోజు తిరుపతిలో గ్రాండ్‌గా విడుదల చేసింది. ట్రైలర్ అంతటా అనిల్ రావిపూడి మార్క్ కామెడీ, చిరంజీవి టైమింగ్ హైలైట్‌గా నిలిచాయి. చిరంజీవి తన వింటేజ్ కామెడీ అండ్ యాక్షన్ మేనరిజమ్స్‌తో అభిమానులను అలరించారు. ఈ సినిమాలో మరో విశేషం ఏమిటంటే, విక్టరీ వెంకటేష్ కీలక పాత్రలో కనిపించబోతున్నాడు. ట్రైలర్ చివరిలో వీరిద్దరి మధ్య వచ్చే సన్నివేశం థియేటర్లలో నవ్వుల పువ్వులు పూయించడం ఖాయమని ట్రైలర్ చూస్తుంటే అర్థమవుతోంది. భీమ్స్ సిసిరోలియో అందించిన నేపథ్య సంగీతం అదిరిపోయింది.




## 'పుష్ప-2' రికార్డు దిశగా అడుగులు.. 800 కోట్ల క్లబ్‌లో 'ధురంధర్'!


బాలీవడ్ బాక్సాఫీస్ వద్ద 'ధురంధర్' సృష్టించిన సునామీ ఇంకా ఆగడం లేదు. బాలీవుడ్ చరిత్రలో మరే ఇతర హిందీ సినిమాకు సాధ్యం కాని రీతిలో ఈ చిత్రం సరికొత్త రికార్డులను తిరగరాస్తోంది. విడుదలైన ఐదో వారంలో కూడా మంచి కలెక్షన్లు సాధిస్తున్న ఈ సినిమా తాజాగా ఇండియన్ బాక్సాఫీస్ వద్ద రూ. 800 కోట్ల క్లబ్‌లో అడుగుపెట్టింది. దీంతో భారతీయ సినీ పరిశ్రమలో ఒక హిందీ సినిమా రూ. 800 కోట్ల మైలురాయిని అందుకున్న చిత్రంగా ధురంధర్ రికార్డులకెక్కింది. అలాగే ప్రస్తుతం బాలీవుడ్ మార్కెట్‌లో 'పుష్ప 2' (హిందీ వెర్షన్) అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా మొదటి స్థానంలో ఉంది. ఇప్పుడు 'ధురంధర్' సాధిస్తున్న వసూళ్ల వేగాన్ని చూస్తుంటే అతి త్వరలోనే 'పుష్ప 2' లైఫ్ టైమ్ బిజినెస్ రికార్డును ధురంధర్ అధిగమించడం ఖాయంగా కనిపిస్తోంది. దీంతో హిందీ బెల్ట్‌లో అత్యధిక వసూళ్లు రాబట్టిన నంబర్ వన్ చిత్రంగా అవతరించేందుకు 'ధురంధర్' కేవలం కొన్ని అడుగుల దూరంలోనే ఉంది.

## సత్య 'జెట్లీ' గ్లింప్స్ రిలీజ్.. ఈ సారి కామెడీ మామూలుగా ఉండదు!




'మత్తు వదలరా' సినిమాతో టాలీవుడ్‌లో ఒక కొత్త తరహా కామెడీని పరిచయం చేసిన కాంబో మళ్ళీ ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. కమెడియన్ సత్య హీరోగా యువ దర్శకుడు రితేష్ రానా రూపొందిస్తున్న సరికొత్త చిత్రం 'జెట్లీ'. ప్రస్తుతం షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం నుంచి తాజాగా గ్లింప్స్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ సినిమా గ్లింప్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'మేడిపండు చూడ మేలిమై యుండును..' అనే వేమన పద్యంతో ఈ గ్లింప్స్ ప్రారంభం అయ్యింది. ఒక ఫ్లైట్ హైజాక్ నేపథ్యంలో సాగే ఈ కామెడీ సన్నివేశాలు గ్లింప్స్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా వెన్నెల కిషోర్, సత్య మధ్య వచ్చే సంభాషణలు ప్రేక్షకులను కడుపుబ్బ నవ్విస్తున్నాయి. "నువ్వు ఏ టైర్ హీరోవి?" అని వెన్నెల కిషోర్ వేసిన ప్రశ్నకు, సత్య తనదైన శైలిలో "నేను జనరల్ కంపార్ట్‌మెంట్ హీరోని" అంటూ సమాధానం ఇవ్వడం సినిమాపై అంచనాలను పెంచుతోంది. సత్య, రియా సింఘా, వెన్నెల కిషోర్, అజయ్ ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం ఇప్పటికే 60 శాతం షూటింగ్ పూర్తి చేసుకుందని నిర్మాత చెర్రీ తెలిపారు. 'మత్తు వదలరా' సిరీస్ తర్వాత వస్తున్న ఈ సినిమా, ప్రేక్షకులకు మరోసారి నాన్-స్టాప్ వినోదాన్ని పంచుతుందని దర్శకుడు రితేష్ రానా ధీమా వ్యక్తం చేశారు. ఇక వేసవి కానుకగా 'జెట్లీ' థియేటర్లలో సందడి చేయనుంది.

## బాలీవుడ్‌లోకి ఆది సాయికుమార్ 'శంబాల'.. హిందీ ట్రైలర్ రిలీజ్




టాలీవుడ్ యువ నటుడు ఆది సాయికుమార్ బాలీవుడ్ ఎంట్రీకి సర్వం సిద్ధమైంది. ఆయన కథానాయకుడిగా నటించిన భారీ బడ్జెట్ సోషియో-ఫాంటసీ థ్రిల్లర్ 'శంబాల' హిందీ ట్రైలర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. ఇప్పటికే ఈ చిత్రం తెలుగులో విడుదలై మంచి హిట్ అందుకోవడమే కాకుండా రూ.20 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. ఇప్పుడు ఇదే చిత్రాన్ని హిందీలో విడుదల చేయబోతున్నారు మేకర్స్. తెలుగు నటులు వరుసగా పాన్ ఇండియా సినిమాలతో ఉత్తరాది ప్రేక్షకులను పలకరిస్తున్న తరుణంలో ఆది కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. ఈ చిత్రానికి యుగంధర్ ముని దర్శకత్వం వహించారు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఇది 1980ల నాటి కథ. శంబాల అనే ఊర్లో ఓ ఉల్క పడుతుంది. ఆ ఉల్క పడిన నాటినుంచి ఆ ఊరిలో అన్నీ అపశకునాలు కనిపిస్తుంటాయి. దాంతో శాస్త్రాలను, దేవుళ్లనీ, దెయ్యాలనీ అమితంగా నమ్మే ఆ ఊరి జనం ఆ ఉల్కని 'బండ భూతం' అని పిస్తుంటారు. ఈ నేపథ్యంలో ఆ ఉల్కని స్టడీ చేసుందుకు సైంటిస్ట్ విక్రమ్(ఆది సాయికుమార్) ఆ ఊళ్లోకి అడుగుపెడతాడు. అతను సైన్స్‌ని మాత్రమే నమ్ముతాడు. ఊరిజనాల నమ్మకాలన్నీ మూఢ నమ్మకాలని అతని ఉద్దేశ్యం. ఆ ఉల్క పడిన నాటి నుంచి ఆ ఊరివాడైన రాములు(రవివర్మ) చిత్రంగా ప్రవర్తిస్తుంటాడు. ఓ ఆవుకు పాలు పిండబోతే, పాలకు బదలు రక్తం కారుతుంటుంది. ఆ ఆవుని చంపితే కానీ ఈ ఊరికి పట్టిన అరిష్టం పోదని ఊరి జనాలు నిర్ణయించుకొని ఆ ఆవును చంపబోతుంటే విక్రమ్ అడ్డుకొని ఆ ఆవుని తనతోపాటు తీసుకెళ్తాడు. ఇక రాములు రోజురోజుకీ రాక్షసుడిలా మారుతుంటాడు. అడ్డొచ్చినవాళ్లందర్నీ చంపుకుంటూ పోతుంటాడు. ఓ దశలో విక్రమ్ మీదకు కూడా ఎగబడతాడు. తాడికి తెగబడతాడు. అసలు ఆ ఊళ్లో ఏం జరుగుతుంది? ఆ ఉల్క వెనుక ఉన్న కథేంటి? ఆ ఊళ్లో అలాంటి భయానకమైన సంఘటనలు జరగడానికి కారణమెవరు? సైన్స్‌ని మాత్రమే నమ్మే విక్రమ్ దేవుడ్ని మొక్కాడా? లేదా? ఈ ప్రశ్నలన్నిమటికీ సమాధానమే మిగతా కథ.



## పార్టీలకు పర్యాయపదంగా మారిన ఓర్రీ..
## సెలబ్రిటీ సర్కిల్స్‌లో ఎందుకంత క్రేజ్?

ఓర్రీ అలియాస్ ఓర్హాన్ అవ్రతమణి పేరు ఇప్పుడు బాలీవుడ్ పార్టీ కల్చర్‌కు సరికొత్త గుర్తింపుగా మారిపోయింది. స్టార్స్, గ్లామర్ భామలు, యంగ్ హీరోలు ఎక్కడ కనిపిస్తే అక్కడ ఓర్రీ తప్పకుండా ఉంటాడన్న మాట వినిపిస్తోంది. సెలబ్రిటీ పార్టీల్లో అతడి హాజరు అంటే ఫన్, హడావిడి, అన్‌ఎక్స్‌పెక్టెడ్ మూమెంట్స్ ఉంటాయనే అభిప్రాయం ఇండస్ట్రీ వర్గాల్లో బలంగా ఉంది. ఓర్రీ కెరీర్ విషయానికి వస్తే.. రిలయన్స్ సంస్థలో జాబ్ చేస్తూనే, నైట్ పార్టీలతో మరో వైపు ఆదాయం సంపాదించడం అతడి ప్రత్యేకతగా చెప్పుకుంటారు. ఈవెంట్స్, ప్రైవేట్ పార్టీల్లో అతడి ప్రెజెన్స్‌కు భారీ డిమాండ్ ఉంది. ఒక్కో ఈవెంట్‌కు లక్షల రూపాయల వరకు రెమ్యునరేషన్ తీసుకుంటాడన్న టాక్ చాలాకాలంగా నడుస్తోంది. ఉద్యోగం కంటే కూడా ఈవెంట్ల ద్వారానే ఎక్కువ సంపాదన ఉంటుందన్న ప్రచారం కూడా ఉంది. అసలు ఓర్రీకి ఇంత క్రేజ్ ఎందుకంటే.. అతడు ఉన్న చోట ఎప్పుడూ సరదా వాతావరణం ఉంటుంది. జనాలను ఆటపట్టించడం, సరదాగా టీజ్ చేయడం, కాస్త ఇర్రిటేట్ చేసినట్టే కనిపించినా చివరకు నవ్వులు పూయించడం అతడి స్టైల్. అందుకే పార్టీ క్రౌడ్స్ అతడిని తెగ ఇష్టపడతారనే మాట వినిపిస్తోంది. ఇటీవలి కాలంలో అతడి ఫ్యాషన్ సెన్స్ కూడా హాట్ టాపిక్‌గా మారింది. ఇక తాజాగా ఓ నైట్ పార్టీలో ఓర్రీ చేసిన పనికి అక్కడున్నవాళ్లంతా షాక్ అయినట్టు తెలుస్తోంది. సెల్ఫీల పేరుతో ఆడా, మగా తేడా లేకుండా అందరినీ హగ్ చేసుకుంటూ, కొందరికి స్వీట్ కిస్ ఇవ్వడంతో పార్టీలో చర్చనీయాంశంగా మారాడు. ఈ ఘటనలో తెలుగు నటుడు హర్షవర్ధన్ రాణే, నటి మౌని రాయ్ వంటి సెలబ్రిటీలు కూడా ఉన్నారట. కొందరికి ఇది ఫన్‌గా అనిపించగా, మరికొందరికి మాత్రం అనూహ్యంగా అనిపించిందని సమాచారం. ఇదిలా ఉండగా, ఓర్రీ త్వరలో నటుడిగా మారబోతున్నాడనే ప్రచారం కూడా సాగుతోంది. అయితే ఇప్పట్లో అతడు పూర్తిగా ఇన్‌ఫ్లూయెన్సర్ కెరీర్‌పైనే ఫోకస్ పెట్టాడని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. భవిష్యత్తులో నటనలోకి వస్తే హీరోగా కాకుండా, తనకు సెట్ అయ్యే క్యారెక్టర్ లేదా కామెడీ రోల్స్‌తో ఎంట్రీ ఇవ్వవచ్చని టాక్. మొత్తానికి, ఓర్రీ పేరు ఇప్పుడు సినిమాల కంటే పార్టీల్లోనే ఎక్కువగా వినిపిస్తోంది. సెలబ్రిటీ కల్చర్‌లో అతడు సృష్టిస్తున్న హడావిడి చూసి, రాబోయే రోజుల్లో అతడి క్రేజ్ ఇంకెంతవరకు వెళ్తుందో చూడాలని ఇండస్ట్రీ ఆసక్తిగా ఎదురుచూస్తోంది.


The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079 , 7936122101,9951751662,